



ఆరిలోవలో శాశ్వత పోలీస్ అవుట్ పోస్ట్


- ప్రభుత్వం ఉత్తర్వులు
- ఉన్న సిబ్బందినే సర్దుబాటు చేసుకోవాలని పోలీస్ కమిషనర్‌కు ఆదేశం

6లో

నీటి ప్రాజెక్టులకు గండం

గత కొన్నేళ్లుగా నిర్వహణ నిల్

- శిథిలావస్థకు చేరుకున్న జలాశయాల గేట్లు
- వర్షాకాలంలోగా మరమ్మతులు చేయకుంటే కష్టమే
- నీరు తీసుకుని అమ్ముకుంటూ కూడా పట్టించుకోని జీవీఎంసీ
- బకాయిల చెల్లింపు కోసం 2008 నుంచి లేఖలు రాస్తున్న జల వనరుల శాఖ



మేహాద్రిగెడ్డ రిజర్వాయర్

- మొత్తం రూ.210.83 కోట్లు
- నగర పాలక సంస్థ నుంచి బకాయిలు రాబట్టుకోవాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ లేఖ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి):

నగరవాసులకు తాగునీరు అందించే ప్రాజెక్టుల నిర్వహణకు నిధులు లేక జల వనరుల శాఖ నానా ఇబ్బందులు పడుతుంది. వైసీపీ పాలనలో ప్రాజెక్టుల నిర్వహణను గాలికొదిలేయడంతో వాటి పరిస్థితి అధ్వానంగా మారింది. ఈ ఏడాది వర్షాకాలంలోగా రైవాడ, మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ల గేట్లు మరమ్మతులు చేయకపోతే ప్రమాదమని జల వనరుల శాఖ ఇంజనీర్లు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. గేట్ల మరమ్మతులకు నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా, జీవీఎంసీ నుంచి బకాయిలు వసూలు చేసుకోవాలని సలహా ఇచ్చింది. జీవీఎంసీ నుంచి రూ.210.83 కోట్లు రావలసి ఉన్నట్టు జల వనరుల శాఖ అధికారులు చెబుతున్నారు.

నగరానికి తాగునీరు, గ్రామీణ ప్రాంతంలో రైతులకు సాగునీటి కోసం దశాబ్దాల క్రితం రైవాడ, మేహాద్రిగెడ్డ, తాటిపూడి, గంభీరం జలాశయాలను నిర్మించారు. గంభీరం తప్ప రైవాడ, మేహాద్రిగెడ్డ, తాటిపూడి నుంచి ఏడాది పొడవునా నగర అవసరాలకు నీరు సరఫరా అవుతుంది. గంభీరం నుంచి నాలుగు నెలలు నీరు అందుతుంది. ప్రస్తుతం రైవాడ నుంచి 27 ఎంజీడీ (మిలియన్ గ్యాలన్స్ పర్ డే) తాటిపూడి నుంచి 11, మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నుంచి 8, గంభీరం నుంచి 2... మొత్తం 48 ఎంజీడీల నీరు నగరానికి సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టుల నుంచి వచ్చే నీటిని జీవీఎంసీ శుద్ధి చేసి ప్రజలు, పరిశ్రమలు, వాణిజ్య సంస్థలకు విక్రయిస్తోంది. నీరు సరఫరా చేసే ప్రాజెక్టుల నిర్వహణ, ఉద్యోగులకు జీతాలు, మరమ్మతులు బాధ్యత మాత్రం జల వనరుల శాఖ చూసుకోవాల్సి ఉంటుంది. అయితే నీటిని వ్యాపార అవసరాలకు విక్రయిస్తున్న జీవీఎంసీ..జల వనరుల శాఖకు మాత్రం సొమ్ములు చెల్లించడం లేదు. తాటిపూడి రిజర్వాయర్ నుంచి వచ్చే నీటికి ఎప్పటికప్పుడు సొమ్ములు చెల్లిస్తున్నా మేహాద్రిగెడ్డ, రైవాడ, గంభీరం విషయం పట్టించుకోవడం లేదు.

బకాయిల చెల్లించాలని కోరుతూ జీవీఎంసీకి జల వనరుల శాఖ ఏటా ఒకటి లేదా రెండుసార్లు లేఖలు రాస్తోంది. జల వనరుల శాఖ వద్ద ఉన్న సమాచారం మేరకు 2008 డిసెంబరు 10న తొలిసారిగా లేఖ రాశారు. చివరగా గత ఏడాది నవంబరు 12 వరకు సుమారు 30 లేఖలు రాసింది. గత ఏడాది మాత్రం రూ.12 కోట్లు విడుదల చేసింది. తాజాగా బకాయిలపై లెక్కలు తీయగా రైవాడ ప్రాజెక్టుకు సంబంధించి రూ.156 కోట్లు, మేహాద్రిగెడ్డకు రూ.49.73 కోట్లు, గంభీరం ప్రాజెక్టుకు రూ. 4.39 కోట్లు, తాటిపూడికి రూ.0.74 కోట్లు చెల్లించాల్సి ఉంది.

మరో రెండు నెలల్లో వర్షాకాలం ప్రారంభం కానున్నందున రైవాడ, మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ గేట్లు కొన్నింటికి తక్షణమే మరమ్మతులు చేయాల్సి ఉందని, నిధులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని జల వనరుల శాఖ కోరింది. ఆ రెండు ప్రాజెక్టుల నిర్వహణకు సంబంధించి బడ్జెట్‌లో నిధులు కేటాయించేందుకు ఎటువంటి అవకాశం లేదని పేర్కొన్న ప్రభుత్వం, నీరు తీసుకుంటున్న జీవీఎంసీ నుంచి బకాయిలు వసూలుచేయాలని స్పష్టంచేసింది. అయినా మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌కు ఆరు గేట్లు ఉండగా రెండు పూర్తిగా శిథిలమయ్యాయని, వర్షాకాలంలో పైనుంచి వచ్చే వరదను విడిచిపెట్టే సమయంలో ప్రమాదం చోటుచేసుకునే అవకాశం ఉందని, అందువల్ల రూ.3.2 కోట్లు తక్షణమే విడుదల చేయాలని రెండోసారి ప్రభుత్వానికి ప్రతిపాదనలు ... మిగతా 6వ పేజీలో

నేటి నుంచి పాల ధర పెంపు

- లీటర్‌కు రూ.2 పెంచిన విశాఖ డెయిరీ
- వినియోగదారులపై రోజుకు రూ.10 లక్షల భారం
- పెరుగు ధరలు కూడా...

అక్కిరెడ్డిపాలెం, మే 9 (ఆంధ్రజ్యోతి: పాల వినియోగదారులపై మరింత భారం మోపేందుకు విశాఖ డెయిరీ యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు శనివారం నుంచి పాల ధరను లీటరుకు రెండు రూపాయలు, పెరుగు ధరను కిలోకు రెండు రూపాయలు



పెంచుతున్నట్టు ప్రకటించింది. నూతన ధరల ప్రకారం హోమోజినైజ్డ్ డబుల్ టోన్డు పాలు 500 ఎంఎల్ (అర లీటరు) ప్రస్తుతం రూ.25 ఉండగా, రూ.26కు పెంచింది. లీటరు రూ.50 నుంచి రూ.52 చేసింది. హోమోజినైజ్డ్ టోన్డు పాలు అరలీటరు రూ.27 నుంచి రూ.28కు, లీటరు ప్యాకెట్ రూ.54 నుంచి రూ.56కు, టోన్డు పాలు అరలీటరు రూ.27 నుంచి రూ.28కు, స్టాండర్డైజ్డ్ పాలు అర లీటరు రూ.30 నుంచి రూ.31కు, ఫుల్ క్రీమ్ పాలు లీటరు రూ.63 నుంచి రూ.66కు, హోమోజినైజ్డ్ టోన్డు పాలు (గంగ) అరలీటరు రూ.28 నుంచి రూ.29కు, డబుల్ టోన్డు పాలు (గంగ) రూ.26 నుంచి రూ.27కు పెంచింది.

కాగా టోన్డు పెరుగు 180 గ్రాముల ప్యాకెట్ రూ.14 నుంచి రూ.15కు, 900 గ్రాముల ప్యాకెట్ రూ.54 నుంచి రూ.56కు, కేజీ ప్యాకెట్ రూ.64 నుంచి రూ.66కు పెంచారు. పెరిగిన ధరలు శనివారం నుంచి అమల్లోకి రానున్నాయి.

రూ.10 లక్షలకు పైగా భారం

విశాఖ డెయిరీ ప్రతిరోజు సుమారు 5 లక్షల లీటర్ల పాలను విక్రయిస్తుండడంతో డెయిరీ పరిధిలోని ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని వినియోగదారులపై రోజుకు సుమారు రూ.10 లక్షల మేర అధిక భారం పడుతుందని అంచనా వేస్తున్నారు.

కి'లేడీ'

తీరు మార్చుకోని పోలీస్ అధికారిణి స్వర్ణలత

- నగరంలో పనిచేస్తున్న సమయంలో నోట్ల మార్పిడి వ్యవహారంలో ఒకసారి అరెస్టు
- ఆ తరువాత వైసీపీ నాయకుడి ద్వారా మళ్లీ పోస్టింగ్
- ఇప్పుడు ఏసీబీ పేరుతో బెదిరింపులు
- మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి డబ్బులు గుంజేందుకు యత్నించి మరోమారు పోలీసులకు చిక్కిన వైనం



స్వర్ణలత

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అడ్డగోలు సంపాదనకు అలవాటుపడిన రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ స్వర్ణలత ప్రభుత్వ శాఖల సిబ్బందినీ బెదిరించి డబ్బులు గుంజుతున్నారు. ఇందుకోసం ఆమె నమ్మకమైన మనుషులతో బృందాలనే ఏర్పాటుచేసుకున్నారు. అవసరాలకు ఉపయోగపడతారని రాజకీయ ప్రముఖులతోను అంట కాగుతున్నారు.

ఆమె గతంలో నగరంలో పనిచేసినప్పుడు వైసీపీకి చెందిన ఓ ప్రముఖ నాయకుడితో గట్టి పరిచయమే ఉంది. తనకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయని, వారి వివరాలు కావాలని సదరు నాయకుడు కోరగా పోలీస్ పెద్దలతో ఉన్న పరిచయాలతో ఆమె ఆ జాబితా సంపాదించి గంటల వ్యవధిలోనే అందించారు. ఆమెకు సినిమాలపై మోజు, సదరు నాయకుడికి కొన్ని సినిమాలు నిర్మించిన అనుభవం కూడా ఉండడంతో వారి లావాదేవీలు మరింత ముందుకు వెళ్లాయి. ప్రభుత్వం నిషేధించిన రూ.2 వేల నోట్లను భారీ సంఖ్యలో మార్పిడి వ్యవహారంలో నేవీ సిబ్బందినే బెదిరించి ఆమె 2023లో పోలీసులకు దొరికిపోయారు. ఆ కేసుతో అరెస్టయి, జైలు పాలయ్యారు. ఆ తరువాత కూడా వెనక్కి తగ్గలేదు. వైసీపీకి చెందిన మరో నేత ద్వారా కేసు కొట్టి వేయించుకొని మళ్లీ పోస్టింగ్ వేయించుకున్నారు. బాపట్లలో ఉద్యోగం చేస్తూనే విశాఖలో పలు శాఖల అధికారులను బెదిరిస్తూ లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారు.

రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, రిజిస్ట్రేషన్ల శాఖలపై దృష్టి

రెవెన్యూ శాఖలో తహశీల్దార్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, రిజిస్ట్రేషన్ల శాఖలో సబ్ రిజిస్ట్రార్లకు అడ్డగోలు ఆదాయం వస్తుందని గ్రహించి, కీలకమైన స్థానాల్లో ఉన్నవారిని 'ఏసీబీ' పేరుతో బెదిరించి స్వర్ణలత భారీ వసూళ్లకు పాల్పడుతున్నారు. తాజాగా మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఏసీబీ సీఐగా వెళ్లి దొరికిపోయిన బలగా సుధాకర్ ఆమె బృందంలో మనిషేనని బయటపడింది. నకిలీ సీఐ సుధాకర్...'ఉన్నతాధికారితో మాట్లాడండి' అంటూ స్వర్ణలతకు ఫోన్ చేయడంతో ఆమె గుట్టు రట్టయింది. తొలుత ఆమెను తప్పించాలని కొందరు పెద్దలు యత్నించారు. కానీ అప్పటికే సమాచారం లీక్ కావడం, పత్రికల్లో ఆమె వివరాలు రావడంతో అరెస్టు చేయక తప్పలేదు. ఆమె ఫోన్ కాల్ లిస్ట్‌లో పలు శాఖలకు చెందిన కొందరు అధికారుల నంబర్లు ఉన్నట్టు గుర్తించారు. వారితో రెగ్యులర్‌గా సంభాషిస్తున్నట్టు తెలిసింది. అందులో కొందరు అధికారులు ... మిగతా 6వ పేజీలో

అంతటా అప్రమత్తం

విమానాశ్రయంలో ముమ్మర తనిఖీలు

పారిశ్రామిక ప్రాంతంలో గట్టి భద్రత

- సెలవుల్లో ఉన్నవారు వెంటనే విధుల్లో చేరాల్సిందిగా రక్షణ శాఖ, సంబంధిత సంస్థల ఆదేశం

గోపాలపట్నం/మల్కాపురం, మే 9 (ఆంధ్రజ్యోతి):

పాకిస్థాన్‌తో యుద్ధం నేపథ్యంలో నగరంలో కీలక ప్రాంతమైన అంతర్జాతీయ విమానాశ్రయంలో పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టారు. ఎయిర్‌పోర్టులోకి వచ్చే ప్రతి వాహనాన్నీ సీఐఎస్ఎఫ్ బలగాలు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నాయి. విమానాశ్రయంలోకి వెళ్లే మార్గంలో భద్రతా దళాలు నిత్యం పహారా కాస్తున్నాయి.



విమానాశ్రయంలోనికి వెళ్లే వాహనాలను తనిఖీ చేస్తున్న భద్రతా దళం

నిఘా నీడన పారిశ్రామిక ప్రాంతం

విశాఖకు ఆయువుపట్టుగా నిలిచే పారిశ్రామిక ప్రాంతంలో రక్షణ సంస్థలు డేగ కన్నుతో పహారా కాస్తున్నాయి. ఈ ప్రాంతంలో తూర్పు నౌకాదళ ప్రధాన కార్యాలయం, నేవల్ డాక్‌యార్డు, షిప్ బిల్డింగ్ సెంటర్ (ఎస్‌బీసీ), షిప్‌యార్డు, కోస్టుగార్డు ప్రధాన కార్యాలయం, భూగర్భంలో చమురు, గ్యాస్ నిల్వల ప్రాజెక్టులు, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, కోరమాండల్ ఎరువుల కర్మాగారం తదితర కీలక సంస్థలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో గట్టి నిఘా ఉంచాయి. కేంద్ర ఇంటెలిజెన్స్ వర్గాల నుంచి గురువారం రాత్రి స్పష్టమైన ఆదేశాలు వెలువడిన నేపథ్యంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. కంపెనీలోకి వచ్చి, పోయేవారిని తనిఖీ చేస్తున్నారు. అనుమానితులను ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా రక్షణ శాఖకు సంబంధించి సెలవులపై ఉన్నవారు వెంటనే విధుల్లో చేరాలని సంస్థ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. ఇదిలావుండగా ఈ సంస్థలన్నీ మల్కాపురం పోలీసుస్టేషన్ పరిధిలోనే ఉండడంతో పోలీసు శాఖను కూడా అప్రమత్తం చేశారు. సెలవుల్లో ఉన్న పోలీసులు తక్షణం విధుల్లోకి చేరాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.



వైభవంగా అనంత పద్మనాభ ఆలయ శిఖర ప్రతిష్ఠా మహోత్సవం

పద్మనాభం అనంత పద్మనాభుని ఆలయ శిఖర ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా విమాన శిఖర ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం భక్తుల గోవింద నామ స్మరణ నడుమ అంగరంగ వైభవంగా సాగింది. - 6వ పేజీలో

కార్డుదారులకు నాసిరకం పంచదార!

- అర కిలోకుగాను కొన్ని ప్యాకెట్లలో 50 గ్రాముల వరకూ తక్కువ...
- పట్టించుకోని పౌర సరఫరాల సంస్థ

విశాఖపట్నం/గాజువాక, మే 9 (ఆంధ్రజ్యోతి):

బియ్యం కార్డుదారులకు ఈ నెల నాసిరకం పంచదార సరఫరా చేశారు. తడిగానే కాకుండా పిండి మాదిరిగా ఉందని కార్డుదారులు చెబుతున్నారు. కొద్దిరోజులు నిల్వ చేస్తే నీరులా తయారవుతుందంటున్నారు. బియ్యం కార్డుదారులకు అరకిలో రూ.17కు ప్రభుత్వం పంచదార అందిస్తోంది. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో కందిపప్పు కూడా ఇచ్చింది. గడచిన మూడు నెలల నుంచి బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేస్తోంది. బియ్యం ఒక్కొక్క నెలలో నాణ్యంగానే ఉంటున్నాయని కార్డుదారులు చెబుతున్నారు. పంచదార మాత్రం గతంలో పూస మాదిరిగా ఉండే ప్యాకెట్లు సరఫరా చేసేవారు. అయితే మే నెలలో ఇచ్చిన పంచదార ఏమి బాగాలేదని, నాసిరకంగా ఉందని పలువురు కార్డుదారులు చెబుతున్నారు. దీనికితోడు అరకిలో ప్యాకెట్లలో 50 గ్రాముల వరకూ తక్కువ ఉందని ఎండీయూ ఆపరేటర్లకు కార్డుదారులు ఫిర్యాదు చేస్తున్నారు. జిల్లాలో గల 5.29 లక్షల కార్డుదారులకు ఎనిమిది వేల టన్నుల బియ్యం, 250 టన్నుల పంచదార పౌర సరఫరాల సంస్థ గోదాములకు పంపిస్తోంది. స్టాకు వచ్చినప్పుడు సరకు ... మిగతా 6వ పేజీలో

బీఈడీ కాలేజీల ఇష్టారాజ్యం

- విద్యార్థులు తరగతులకు హాజరుకాకపోయినా పరీక్షలు రాసేందుకు అనుమతిస్తున్న కొన్ని కళాశాలలు
- అందుకు భారీగా డబ్బులు వసూలుచేస్తున్న యాజమాన్యాలు
- ఒకచోట అనుమతులు తీసుకుని, మరోచోట నిర్వహణ
- సిబ్బంది, మౌలిక వసతులను పరిశీలించకుండానే ప్రవేశాలకు ఏయూ అధికారుల గ్రీన్‌సిగ్నల్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనది. అందుకే ఉపాధ్యాయుడికి సమాజంలో ఎంతో గౌరవం ఉంటుంది. అయితే, అటువంటి ఉపాధ్యాయులను తయారుచేసే బీఈడీ కాలేజీల నిర్వహణ అధ్వానంగా మారడం ఆందోళన కలిగిస్తోంది. అనేక కాలేజీలు విద్యార్థులు తరగతులకు హాజరుకాకపోయినా ఫీజులు చెల్లిస్తే చాలు



సర్టిఫికెట్లను అందిస్తున్నాయి. ఈ విషయం తెలిసినా ఏయూ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో సుమారు 70 వరకూ బీఈడీ కాలేజీలు ఉన్నాయి. అందులో కొన్ని కాలేజీల్లో అడ్డగోలు వ్యవహారాలు జరుగుతున్నాయన్న విమర్శలు చాలాకాలంగా ఉన్నాయి. సాధారణంగా బీఈడీ కాలేజీలు నిర్వహించాలంటే కొన్ని నిబంధనలను పాటించాలి. అందుకు అనుగుణంగా భవనాలు, అర్హత కలిగిన సిబ్బంది వంటివి ఉండాలి. ఇవన్నీ ఉంటేనే ఏయూ అధికారులు అనుమతులు ఇవ్వాలి. ఏటా పరిశీలించిన తరువాతే అడ్మిషన్లకు అవకాశం ఇవ్వాలి. అయితే, అనేక కాలేజీలు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నప్పటికీ అనుమతులు ఇచ్చేస్తున్నారు. సాధారణంగా కాలేజీ ఏర్పాటు చేసినప్పుడు అడ్రస్, ఇతర వివరాలు ఇస్తారు. అయితే, రెండు జిల్లాల్లోని అనేక కాలేజీలు ఇచ్చిన అడ్రస్‌కు, నిర్వహిస్తున్న అడ్రస్‌కు సంబంధమే ఉండడం లేదు. ఈ విషయాలు తెలిసినప్పటికీ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. అలాగే, ... మిగతా 6వ పేజీలో

ఏయూఈఈటీ-2025 ఫలితాలు విడుదల

విశాఖపట్నం, మే 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ కోర్సుల్లో (సెల్ఫ్ సపోర్ట్) ప్రవేశాల కోసం నిర్వహించిన ఏయూఈఈటీ-2025 ఫలితాలను శుక్రవారం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ విడుదల చేశారు. ఈ పరీక్షకు 6,028 మంది దరఖాస్తు చేయగా, 5,634 మంది హాజరయ్యారు. విశాఖకు చెందిన మామిడి రోహిత్ మొదటి ర్యాంకు సాధించగా, పాలకొండకు చెందిన కె.చరణ్‌రామ్‌సాయి రెండో ర్యాంకు, విశాఖకు చెందిన వీవీ కాశ్యప్ మూడో ర్యాంకు, బొబ్బిలికి చెందిన ఎం.కార్తికేయ నాలుగు, ఇచ్ఛాపురానికి చెందిన ఎస్.అక్షయ్ కుమార్ ఐదో ర్యాంకు సాధించారు. పరీక్షల ఫలితాలను ప్రవేశాలను వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు అధికారులు వెల్లడించారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ప్రొఫెసర్ ఎన్.కిశోర్‌బాబు, రిజిస్ట్రార్ ఇఎన్ ధనుంజయరావు, ప్రవేశాల సంచాలకులు డీఏ నాయుడు, తదితరులు పాల్గొన్నారు. కౌన్సెలింగ్‌కు సంబంధించిన షెడ్యూల్‌ను కొద్దిరోజుల్లో విడుదల చేస్తామని డీఏ నాయుడు తెలిపారు.



ఏయూ ఈఈటీ-2025 ఫలితాలను విడుదల చేస్తున్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్

ఏషియన్ చాంపియన్‌షిప్ టోర్నీకి జ్యోతి

విశాఖపట్నం, స్పోర్ట్సు, మే 9 (ఆంధ్రజ్యోతి):



ఎర్రాజీ జ్యోతి

నగరానికి చెందిన అంతర్జాతీయ అథ్లెట్, ఒలింపియన్ ఎర్రాజీ జ్యోతి మరో ప్రతిష్ఠాత్మక టోర్నీకి ఎంపికైంది. ఈనెల 27 నుంచి సౌత్ కొరియాలోని గుమిలో జరగనున్న ఏషియన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ టోర్నీలో భారత జట్టుకు జ్యోతి ప్రాతినిధ్యం వహించనున్నది. దేశంలో అత్యంత వేగవంతమైన అథ్లెట్‌గా గుర్తింపుపొందిన జ్యోతి భారత్ నుంచి ఒలింపిక్స్‌లో పాల్గొన్న తొలి మహిళా హర్డలర్‌గా ప్రత్యేకతను సంపాదించుకుంది. గతంలో ఏషియన్ గేమ్స్‌లో రజత పతకం, ఏషియన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం, వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో కాంస్య పతకం సాధించింది. అనేక జాతీయ, అంతర్జాతీయ స్థాయి టోర్నీల్లో 100 మీటర్ల హర్డిల్స్‌లో పతకాలు సాధించింది. ఏషియన్ చాంపియన్‌షిప్ టోర్నీలో జ్యోతి పాల్గొననుండడంపై జిల్లా కలెక్టర్ హరేంద్రప్రసాద్, ఎమ్మెల్యే గణబాబు, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, శాప్ చైర్మన్ రవినాయుడు, డీఎస్‌డీవో జూన్ గ్యాలియట్, ద ఒలింపిక్ సంఘం ప్రతినిధులు కంచరాన సూర్యనారాయణ, మోహన్‌తో పాటు జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రతినిధులు డి.నాగేశ్వరరావు, ఎం.నారాయణరావు, అప్పలరాజు, రాంకుమార్ తదితరులు హర్షం వ్యక్తంచేస్తూ దేశానికి పతకం అందించాలని ఆకాంక్షించారు.

కమనీయం.. అప్పన్న నిత్య కల్యాణం


కల్యాణం చేస్తున్న అర్చకులు

సింహాచలం, మే 9 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం శుక్రవారం కమనీయంగా సాగింది. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం శాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ముగిసిన రెండో విడత చందనం అరగదీత

సింహాచలం, మే 9 (ఆంధ్రజ్యోతి) : వైశాఖ పౌర్ణమి అనగా ఈనెల 12న అప్పన్న స్వామికి పైపూతగా సమర్పించనున్న రెండో విడత చందనం అరగదీత శుక్రవారంతో ముగిసింది.ఈనెల 7వ తేదీ నుంచి రెండో విడత చందనం అరగదీతకు శ్రీకారం చుట్టారు. 15 మంది ఆలయ సిబ్బంది తొలి రోజు 42 కిలోలు, రెండవ రోజు 45 కిలోలు, మూడవ రోజు 40 కిలోల చందనాన్ని అరగదీశారు. మొత్తంగా మూడు మణుగుల (125 కిలోలు) చందనం ముద్దను అరగదీయగా ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ తూనిక వేసి పద్మనిధిలో భద్రపరిచారు. అందులో 32 రకాల సుగంధ ద్రవ్యాల చూర్ణాలను మిళితం చేసి ఈనెల 12న వేకువజామున వైదికులు సుప్రభాత సేవ తరువాత స్వామివారికి పైపూతగా సమర్పించనున్నారు.

బోరుకు మరమ్మతులు

తగరపువలస, మే 9 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ రెండో వార్డు చిల్లపేటలో తాగునీటి బోరుకు జనసేన నాయకులు శుక్రవారం మరమ్మతులు చేయించారు. బోరు పాడవ్వడంతో స్థానికులు తాగునీటికి ఇబ్బంది పడేవారు. ఈ విషయాన్ని వార్డు జనసేన అధ్యక్షుడు ఎన్.శంకర్‌రెడ్డి నీటి సరఫరా విభాగం అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో వారు మరమ్మతులు చేపట్టారు.

నేటి నుంచి సీపీఐ జిల్లా మహాసభలు

తగరపువలస, మే 9 (ఆంధ్రజ్యోతి) : నగరంలో శనివారం నుంచి సీపీఐ జిల్లా మహాసభలు జరగనున్నట్టు ఆ పార్టీ నాయకులు తెలిపారు. శుక్రవారం వారు స్థానిక జీఆర్ భవన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీపీఐ ఏరియా కార్యదర్శి కె. రాంబాబు మాట్లాడుతూ 10న కంచరపాలెం జంక్షన్ నుంచి ఐటీఐ జంక్షన్ వరకు ర్యాలీ చేసి, అనంతరం బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ సభకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ ముఖ్యఅతిథిగా, సహాయ కార్యదర్శి జేవీఎస్ మూర్తి ఉపన్యాసకుడిగా హాజరవుతారని చెప్పారు. రెండవ రోజు పార్టీ నూతన కార్యవర్గం ఎన్నికలు జరుగుతాయన్నారు. తగరపువలస, చిట్టివలస ప్రాంతాలకు చెందిన కార్మి కులు, కర్షకులు ఈ సభలకు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు ఎం. అప్పలరాజు, కె. ఈశ్వరరావు, రామ్‌పైడి, ఎన్. ఆదినారాయణ, లక్ష్మణరావు, వీర్రాజు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత సీట్లకు దరఖాస్తులు

పద్మనాభం రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత సీట్ల కోసం అర్హు లైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో పి. రమణ తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించారని, ఆసక్తి గల వారు ఒకటో తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తుల స్వీకరణ

పద్మనాభం రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అర్హులైన వారు కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ కె. ఆనందరావు తెలిపారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. కొత్త కార్డులతో పాటు పేర్లు చేర్పు, తొలగింపు, కార్డుదారు నుంచి విడిపోవడానికి, కార్డును వాపసు చేయడానికి, చిరునామా మార్పునకు, తప్పుగా నమోదైన ఆధార్ సవరణకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్టు చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అంధకారంలో తులసీనగర్

మధురవాడ, మే 9 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఆరో వార్డులోని వాకర్స్ పార్క్ సమీపంలో ఉన్న తులసీనగర్‌లో నెల రోజులుగా వీధి లైట్లు వెలగడం లేదు. దీంతో స్థానికులు చీకటి పడిన తరువాత రాకపో కలకు ఇబ్బందులు పడుతున్నారు. లైట్లు లేకపోవడంతో దొంగతనాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయి. మరోవైపు వీధి కుక్కల భయం వెంటాడుతోంది. అలాగే వాకర్స్ పార్కు నుంచి ఇంజినీరింగ్ కళాశాల వరకు ఉన్న ప్రధాన రహదారిలో కూడా కొన్నిచోట్ల లైట్లు వెలగడం లేదు. నెల రోజులుగా ఈ పరిస్థితి ఉన్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ముగిసిన చేపలుప్పాడ అమ్మవార్ల పండగలు

భీమునిపట్నం, మే 9 (ఆంధ్రజ్యోతి) : చేపలుప్పాడ గ్రామంలో నాలుగు రోజులుగా జరుగుతున్న పెద ఉప్పాడ గ్రామ దేవతలు సత్తమ్మతల్లి, పరదేశమ్మ తల్లి, కొత్తమ్మోరు తల్లి పండుగలు శుక్రవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా పలు నేలవేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలరావు, టీడీపీ యువ నేత గంటా రవితేజ, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు, ఆ వార్డు టీడీపీ అధ్యక్షుడు పాసి నరసింగరావు అమ్మవార్లను దర్శించుకున్నారు.

వైభవంగా అనంతుని ఆలయ శిఖర ప్రతిష్ఠ

- తరలివచ్చిన వందలాది భక్తులు
- గోవింద నామ స్మరణతో మార్మోగిన పరిసరాలు


శిఖరంపై వేసిన బూర్లెను పడుతున్న భక్తులు


పూర్ణ కుంభంతో ఎమ్మెల్యే గంటాకు స్వాగతం

పద్మనాభం, మే 9 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని గిరిపై అనంత పద్మనాభుని ఆలయ శిఖర ప్రతిష్ఠ శుక్రవారం అంగరంగ వైభవంగా సాగింది. దేవస్థానం, ఉత్సవ కమిటీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ముందుగా ఆలయ ప్రధాన అర్చకుడు పి. సీతారామాంజనేయస్వామి ఆధ్వర్యంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అగ్ని ధ్యానం, ఉక్త హోమం,అంత హోమం చేసి, పూర్ణాహుతి చేపట్టారు. అనంతరం రత్నన్యాసం, ధాతు న్యాసం, బీజా న్యాసం చేసి విమాన శిఖర ప్రతిష్ఠను భక్తుల జయ, జయ ధ్వానాల మధ్య నిర్వహించారు. విమాన శిఖరంపై వూసిన బూర్లెను భక్తులు పట్టారు.మహాసంప్రోక్షణలో భాగంగా కళావాహన, ప్రథమార్చన, గోదర్శనం, శాంతి కల్యాణం, మహదాశీర్వచనం, ప్రసాద వితరణ చేపట్టారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ఈఓ నానాజీబాబు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ మాజీ ఛైర్మన్ అక్కరమాని విజయనిర్మల, వెంకటరావు దంపతులు, భీమిలి నియోజకవర్గం జనసేన ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్, విజయనగరం జనసేన నాయకుడు అవనాపు విక్రమ్, విజయనగరం జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, వైసీపీ సీనియర్ నాయకులు కేకే రాజు, ఎంపీపీ రాంబాబు, జెడ్పీ వైస్ ఛైర్మన్ గిరిబాబు, డీఎల్‌డీఏ ఛైర్మన్ వెంకటప్పుడు, భీమిలి మార్కెట్ కమిటీ ఛైర్మన్ రామునాయుడు, మాజీ ఎంపీపీ పద్మ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు, టీడీపీ నాయకులు రమణ, నగేశ్‌కుమార్, సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, సర్పంచ్ పాప, ఉత్సవ కమిటీ సభ్యులు నారాయణరావు, పద్దు, ఎర్నాయుడు, పైడిరాజు, రాము, రమణ, తదితరులు పాల్గొన్నారు. కాగా విమాన శిఖర ప్రతిష్ఠ సమయంలో స్వామివారి వాహనమైన గరుడపక్షి మూడుసార్లు ప్రదక్షిణ చేసిన దృశ్యం చూసిన ఎమ్మెల్యే గంటాతో పాటు భక్తులు తన్మయత్వం చెందారు.

ఆలయ విశేషాలపై యాప్

అనంత పద్మనాభుని ఆలయ విశేషాలపై ప్రత్యేక యాప్ రూపొందించడానికి వసుదైక విజనరీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సీఈఓ యలపర్తి అనూష ముందుకు వచ్చారు. శిఖర ప్రతిష్ఠలో కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్న ఆమె కుంతీమాధవస్వామిని దర్శించుకొని పట్టు వస్త్రాలు సమర్పించారు. క్షేత్ర విశేషాలకు ముగ్ధురాలై ప్రపంచంలోని అనంత పద్మనాభుని భక్తులందరికీ ఉపయుక్తంగా ఉండేలా తనవంతుగా యాప్ రూపొందించి, స్వామివారి విశేషాలను, నిత్య పూజా కార్యక్రమాలు పొందుపరుస్తామన్నారు. ఆమె నిర్ణయాన్ని ఎమ్మెల్యే గంటా, ఎంపీపీ రాంబాబు, ఈఓ నానాజీబాబు అభినందించారు.

ఎట్టకేలకు ఘాట్ రోడ్‌కు మోక్షం

పద్మనాభుడి ఘాట్ రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఈరోడ్డు నిర్మాణానికి 20 ఏళ్లు పట్టింది. 2006లో అప్పటి ఏఈ ఆర్. కృష్ణకుమార్ రూపొందించిన అంచనాల మేరకు నాటి ఎమ్మెల్యే కర్రి సీతారాము హయాంలో తొలుత రూ. 6 లక్షలు కేటాయించారు. అనంతరం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు హయాంలో 2010లో రూ. 30 లక్షలు విడుదల చేయించారు. అయినప్పటికీ రోడ్డు ఫార్మేషన్ పూర్తిస్థాయిలో జరగలేదు. 2014లో ఎమ్మెల్యేగా ఎన్నికయిన గంటా శ్రీనివాసరావు 2017లో రూ.5 కోట్లు మంజూరు చేయించి రోడ్డు అలైన్‌మెంటును మార్చి కొత్తగా మళ్లీ నిర్మాణం చేపట్టారు. ఫార్మేషన్ పనితో పాటు గ్రావెల్, మెటల్ రోడ్డు, సైడు కాలువలు నిర్మించారు. అనంతరం వైసీపీ అధికారంలోకి రావడంతో 2019లో ఈ పనులను నిలిపివేసి నిధులను రద్దు చేశారు. ఆ తరువాత రూ. 5 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా పనులు పూర్తిస్థాయిలో జరగలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే గంటా ప్రత్యేక శ్రద్ధ తీసుకొని బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి చేయించారు. అధికారులతో, కాంట్రాక్టర్లతో సమీక్షలు నిర్వహించి రోడ్డు నిర్మాణం పూర్తి చేయించారు. గంటా హయాంలోనే అధిక మొత్తంలో నిధులు మంజూరు చేయించడంతో పాటు ఆయన చేతుల మీదుగానే రోడ్డు శంఖుస్థాపన, ప్రారంభోత్సవం జరిగాయి.

మజ్జివలసలో కుట్టుశిక్షణ కేంద్రం


కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా

భీమునిపట్నం (రూరల్), మే 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మజ్జివలస గ్రామంలో 16 పంచాయతీల పరిధిలోని మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ ద్వారా కుట్టు శిక్షణకు దరఖాస్తు చేసుకున్న మహిళలకు ఈ కేంద్రంలో శిక్షణ ఇస్తారని తెలిపారు. శిక్షణ అనంతరం కుట్టు మిషన్లు అందిస్తారన్నారు. సర్పంచ్ తుపాకుల ఆదిలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు వెంకటప్పడు, మండల పరిషత్ అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి వనరులు కలుషితం


నగరపాలెంలో బావి వద్ద దుస్తులు ఉతుకుతున్న దృశ్యం

భీమునిపట్నం (రూరల్), మే 9 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో తాగునీటి వనరులు కలుషితమవుతున్నాయి. అనేకచోట్ల బావుల వద్ద దుస్తులు ఉతకడంతో పాటు స్నానాలు చేస్తున్నారు. వీటి వల్ల భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. ఆ నీరు మళ్లీ బావుల్లోకి చేరి అనారోగ్యకర పరిస్థితులు ఎదురవుతున్నాయి. నియోజకవర్గంలో 543 గొట్టపు బావులు ఉన్నాయి. వీటిలో 40 శాతం వట్టిపోయి పనికిరాకుండా పోయాయి. రూరల్ మండలంలో అనేక గ్రామాల్లో ఇటువంటి బావులు కనిపిస్తుంటాయి. తాగునీటికి ఉపయోగించాల్సిన బావులను దుస్తులు ఉతకడానికి, స్నానాలు చేయడానికి, ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ఇళ్లకు కొళాయిలు లేకపోవడంతో చాలామంది అన్ని అవసరాలకు వీటినే ఉపయోగిస్తున్నారు. తర్లువాడ, తాటితూరు నగరపాలెం, చిప్పాడ గ్రామాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. కొన్ని పంచాయతీల్లో గొట్టపు బావులు దుర్వినియోగం అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. గ్రామ కార్యదర్శులకు, సర్పంచులకు నీటి పథకాలపై పూర్తి అధికారం ఉన్నప్పటికీ స్థానికంగా ఉన్న మోహమాటం వల్ల నీటిని దుర్వినియోగం చేస్తున్నా.. ఏమీ అనలేకపోతున్నారు. కొన్ని రక్షిత పథకాల నుంచి నిరంతరాయంగా నీరు వృథావుతున్నా.. ఎవరూ చర్యలు తీసుకోవడం లేదు. మరికొన్ని గ్రామాల్లో కొళాయిల నీటితో పశువులను కూడా కడుగుతున్నారు.

సనాతన పద్ధతిలో ఆలయ పైకప్పు మరమ్మతులు


పైకప్పు పనులు చేస్తున్న కార్మికులు

సింహాచలం, మే 9 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయ పైకప్పునకు సనాతన పద్ధతిలో మరమ్మతులు చేపడుతున్నారు. పైకప్పు పెచ్చులూడి, వర్షపు నీరు చిమ్ముతుండడంతో పేణేకి చెందిన వెంకటేశ్వరా చారి ఆధ్యాత్మిక సంస్థ మరమ్మతులు చేపట్టేందుకు ముందుకు వచ్చింది. ఐజీటీ ప్రొఫెసర్ మునిరత్నంరెడ్డి సూచనలకు అనుగుణంగా రెండు నెలల క్రితం ఎంవోయూ జరిగింది. పాడైన పైకప్పును పెచ్చులుగా ఊడదీశారు. కర క్కాయ, గానుగసున్నం, ఇతర మూలికలను కలిపి ప్రత్యేక మిశ్రమంగా తయారుచేసి దానిని పైకప్పుపై వేసే పనిని ప్రస్తుతం ట్రస్టు పర్యవేక్షణలో చేపట్టారు.

11, 12న ఆర్జిత సేవలు రద్దు

వార్షికోత్సవాల నేపథ్యంలో వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో 11, 12 తేదీలలో జరగనున్న ఆర్జిత సేవలు రద్దుచేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. ఈనెల 11న నృసింహస్వామి మాస జయంతి, 12న నమ్మాళ్వార్ తిరునక్షత్ర పూజలు, అప్పన్నస్వామికి రెండో విడత చందన సమర్పణ జరగనున్నాయి. ఈ సందర్భంగా ప్రత్యేక సేవకాలం, పూజలు, విశేష ఉత్సవం నిర్వహించాల్సి ఉన్నందున నిత్య కల్యాణం, స్వాతినక్షత్ర హవనం, గరుడసేవ, సహస్ర నామార్చన సేవలను రద్దు చేశారు. భక్తులు సహకరించాలని ఏఈఓ ఎన్.ఆనందకుమార్ కోరారు.

ఉప్పు నీటి లభ్యతపై అధ్యయనం

తగరపువలస, చిట్టివలస పరిసరాల్లో అధికారుల పరిశీలన


చిట్టివలస వద్ద గోస్తనీ నదిలో ఉప్పు నీరు కలుస్తున్న ప్రాంతం

తగరపువలస, మే 9 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 1, 2 వార్డుల పరిధిలో ఉన్న చిట్టివలస, తగరపువలస పరిసరాల్లోని భూగర్భ జలాలు ఉప్పుగా ఉండడానికి గల కారణాలను అధికారులు అధ్యయనం చేస్తున్నారు. కొన్నేళ్లుగా నెలకొన్న ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడానికి ప్రయత్నిస్తున్నారు. చిట్టివలస, కొత్తపేట గ్రామాల్లో ఎక్కడ బోర్లు తవ్వినా ఉప్పు నీరు వస్తోంది. సురక్షితమైన తాగునీరు లభించకపోవడంతో జీవీఎంసీ అధికారులు పద్మనాభం మండలం సామేయవలస వద్ద గోస్తనీ నదిలో ట్యాంకులు నిర్మించి, అక్కడి నుంచి కుళాయిలకు నీరు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించడానికి నీటిపారుదల శాఖ అధికారులు ప్రయత్నాలు చేపట్టారు. 1989లో చిట్టివలసలో ఉప్పు నీరు నదిలో ప్రవేశించకుండా అడ్డుకట్ట వేశారు. అది విజయవంతం కాలేదు. ఇప్పుడు శాశ్వత పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నారు. చిట్టివలస జూట్‌మిల్లు వెనుకభాగం నుంచి ప్రవహిస్తున్న నది భీమిలిలో సముద్రంలో కలుస్తున్నది. నదిలో కలవడానికి ముందు సముద్రం ముందు 400 ఎకరాల్లో ఉప్పు టేరు ఉంది. సముద్రానికి అటుపోటు విధానంలో ప్రతి ఆరు గంటలకు ఉప్పు టేరులో నీరు చేరుతుంది. చేరిన తర్వాత ఆరు గంటల పాటు తిరిగి సముద్రంలో కలిసి ఎండిపోతుంది. ఈ విధంగా సముద్రపు పోటు ఉన్న ఆరు గంటల సమయంలో ఉప్పుటేరులో చేరిన సముద్రపు నీరు ఏరులో కలిసే నది నుంచి వెనుక నుంచి ప్రవహించి చిట్టివలస వరకు చేరి నది నీటిలో కలుస్తోంది. అందువల్ల చిట్టివలస నుంచి భీమిలి వరకు ఉన్న నది నీరు ఉప్పుగా ఉంటున్న విషయాన్ని గుర్తించామని అధికారులు చెబుతున్నారు. సముద్రపు నీరు నది నీటితో కలవకుండా నివారిస్తే చాలా వరకు నదిలో ఉప్పు నీరు చేరదని దీనివల్ల భూగర్భ జలాలు కూడా ఉప్పుగా మారే అవకాశం ఉండదని అంటున్నారు. గతంలో నిర్మించిన పూనుగట్టు మాదిరిగా ఆధునిక పూనుగట్టు నిర్మిస్తే సమస్య తీరుతుందని చెబుతున్నారు. కాగా ఉప్పు నీరు నదిలో చేరకుండా చేయడానికి గల మార్గాలను కె.చిన్నయ్య అనే ఇంజనీర్ ఉన్నతాధికారులకు విన్నవించారని తెలిసింది. దీనికి నిధులు కేటాయిస్తే తగరపువలస, చిట్టివలస ప్రాంతాల్లోని భూగర్భ జలాల్లో ఉప్పు చేరే ప్రమాదం తప్పుతుందని అంటున్నారు.

కిలేడీ

... 5వ పేజీ తరువాయి

ఆమెను ప్రత్యేకంగా కలవడానికి ప్రతి నెలా పని గట్టుకొని విజయవాడ వెళుతున్నట్టు ఆయా శాఖల సిబ్బంది గుసగుసలాడుతున్నారు. సాధారణంగా తహశీల్దార్లకు, సబ్ రిజిస్ట్రార్లకు ప్రతి నెలా విజయవాడ వెళ్లి ఉన్నతాధికారులను కలవాల్సిన అవసరం ఉండదు. కానీ వారు వెళుతున్నారంటే ఏదో ఉందని అనుమానిస్తున్నారు. కాగా మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లడానికి ముందు నకలీ ఏసీబీ సీఐ బలగ సుధాకర్ జీవీఎంసీ జోనల్-2 కార్యాలయానికి వెళ్లాడు. అక్కడ వారు అనుకున్న విధంగా పని పూర్తయినట్టు తెలిసింది. అక్కడ ఎంత పుచ్చుకున్నారు ?, ఎవరు ఇచ్చారు ?...అనేది బయటకు రానివ్వడం లేదు. ఏసీబీ అధికారులు స్వర్ణలత కేసును మరింత పకడ్బందీగా విచారణ చేసి, అసలు ఇప్పటివరకూ ఎంత మందిని బెదిరించారు?, ఏ మేరకు వసూలు చేశారనే వివ రాలు వెలికితీయాలి. అదేవిధంగా భవిష్యత్తులో ఇలాంటి వ్యవహారాలకు పాల్పడకుండా చూడాలి.

ఆరిలోవలో శాశ్వత పోలీస్ అవుట్ పోస్ట్

విశాఖపట్నం, మే 9 (ఆంధ్రజ్యోతి): ఆరిలోవలో శాంతి భద్రతల పరిరక్షణకు శాశ్వత పోలీస్ అవుట్ పోస్ట్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై శుక్రవారం కీలక ఉత్తర్వులు జారీచేసింది. ఆరిలోవలో 1995లో పోలీస్ స్టేషన్ ఏర్పాటుచేశారు. ఆ తరువాత అవసరాలతో పాటు నేరాల సంఖ్య కూడా పెరగడంతో విమ్స్ ఆవరణలో రూ.5కోట్లతో కొత్త పోలీస్ స్టేషన్ నిర్మించారు. ఇది గత ఏడాది డిసెంబరు నుంచి అందుబాటులోకి వచ్చింది. పోలీసులు అంతా ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారు. అయితే పాత పోలీస్ స్టేషన్ ఆరిలోవ గ్రామంలో ఉండడం, ఆ చుట్టుపక్కలే పెద్ద సంఖ్యలో రౌడీ షీటర్లు, అల్లరి మూకలు ఉండడం వల్ల అక్కడ అవుట్ పోస్ట్ నిర్వహించాల్సి వస్తోంది. ఏదైనా ఘర్షణ, గొడవ జరిగితే స్థానిక ప్రజలు విమ్స్ వరకూ రావలసి వస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో శాంతి భద్రతలు అదుపులో ఉండాలంటే ఎక్కడికక్కడ విజిబుల్ పోలీసింగ్ అవసరమైన నేపథ్యంలో ఆరిలోవ పాత పోలీస్ స్టేషన్‌లోనే శాశ్వత అవుట్ పోస్ట్ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇలా చేస్తే స్థానికులకు పోలీసులు కూడా అందుబాటులో ఉంటారని భావించింది. చర్యలు తీసుకోవాలని విశాఖ సిటీ పోలీస్ కమిషనర్‌కు ఉత్తర్వులు పంపింది. ప్రభుత్వంపై ఆర్థిక భారం పడకుండా ఉన్న సిబ్బందినే సర్దుబాటు చేసుకోవాలని సూచించింది.





భూసార పరీక్షలు తప్పనిసరి : ఏఓ

పద్మనాభం రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని వ్యవసాయాధికారి ఎంవీ చలం చెప్పారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. రైతులు ఏటా భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల పంటలకు ఎంత మోతాదులో ఎరువు వేయాలో తెలుస్తుందన్నారు. అలాగే పంట మార్పిడి వల్ల దిగుబడి పెరుగు తుందని చెప్పారు.

చలివేంద్రం ఏర్పాటు

మధురవాడ, మే 9 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని నగరంపాలెం రోడ్డులో మధురవాడ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రం ప్రారంభించారు. తొలిరోజు పిళ్లా బంగారయ్య ఛారిటబుల్ ట్రస్టు సహకారంతో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ఛైర్మన్ పిళ్లా నరసింగరావు, మోహన్‌కృష్ణ, పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు సూర్యప్రకాశరావు, టీఎస్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతి శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

మధురవాడ, మే 9 (ఆంధ్రజ్యోతి) : బొట్టవానిపాలెం ఫారెస్ట్ లేఅవుట్ మైదానంలో పది రోజులుగా పిళ్లా బంగారయ్య మెమోరియల్ సౌజన్యంతో జరుగుతున్న ఎంసీబీ క్రికెట్ టోర్నమెంట్ ముగిసింది. యువ క్రీడాకారులు పోతిన ఆనంద్,మణిగాం కుమార్, పిళ్లా ఆనంద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ టోర్నీలో జిల్లా వ్యాప్తంగా 32 జట్లు పాల్గొన్నాయి. పెందుర్తికి చెందిన మరిడిమాంబ-11 జట్టు విజేతగా, మధురవాడకు చెందిన పండా అడ్డా-11 జట్టు రన్నర్‌గా నిలిచాయి.

కార్డుదారులకు నాసిరకం పంచదార

... 5వ పేజీ తరువాయి

నాణ్యత పరిశీలించి ప్రమాణాల కంటే తక్కువగా ఉంటే వెనక్కి పంపేసే అధికారం జిల్లా పౌర సరఫరాల సంస్థకు ఉంది. కానీ గోదాముల ఇన్‌చార్జులు, పౌర సరఫరాల సంస్థ అధికారులు ఏమి పట్టించుకోవం లేదని రేషన్ డీలర్లు ఆరోపిస్తున్నారు. నాసిరకం పంచదార పంపిణీ వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని వ్యాఖ్యానిస్తున్నారు.


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

తిమ్మాపురంలో తాటిచెట్లు దగ్ధం

సాగర్‌నగర్, మే 9 (ఆంధ్రజ్యోతి) : తిమ్మాపురం రామానాయుడు స్టూడియో ఎదురుగా వున్న సముద్ర తీరంలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో 30 తాటిచెట్లు దగ్ధమయ్యాయి. బీచ్ రోడ్డుకు ఆనుకుని ఉన్న తీరంలో దట్టమైన తాటిచెట్ల వనం ఉంది. దీంతో ఈ ప్రాంతంలో ఎక్కువగా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటాయి.ఎవరో సిగరెట్ కాల్చి ఆరపకుండా పడేయడంతో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. గతంలోనూ ఇక్కడ ఇదే తరహాలో ప్రమాదం జరగడంతో చాలా చెట్లు కాలిపోయాయి.

బీచ్ రోడ్డులో అర్ధరాత్రి భూ వివాదం

సాగర్‌నగర్, మే 9 (ఆంధ్రజ్యోతి) : బీచ్ రోడ్డులో తిమ్మాపురం వద్ద గురువారం అర్ధరాత్రి భూ వివాదం చోటుచేసుకుంది. ఓ ప్రైవేటు స్థలంలో అర్ధరాత్రి జరిగిన నిర్మాణాల ధ్వంసం ఘటనపై పీఎంపాలెం పోలీస్ స్టేషన్‌లో బాధితులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. స్థలానికి సమీపంలో సెక్యూరిటీగా పనిచేస్తున్న ఇద్దరిని కొందరు దుండగులు అర్ధరాత్రి నెంబరు ప్లేట్లుపై తెల్ల కాగితాలు అతికించిన కార్లలో వచ్చి రుషికొండలో తిప్పి స్థలంలో ఉన్న కట్టడాలను పూర్తిగా తొలగించిన తరువాత అదే స్థలం వద్ద వారిని విడిచి పెట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా భూ వివాదంపై సీఐ బాలకృష్ణను వివరణ కోరగా స్థలంలో జరిగిన విధ్వంస ఘటనపై ఫిర్యాదు రావడంతో ఉదయం అక్కడికి వెళ్లి పరిశీలించామన్నారు. ఆ భూమి తమదంటూ మరికొందరు వ్యక్తులు స్టేషన్‌కు ఫోన్ చేశారని, వారి ఇరువురి భూపత్రాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జరిగిన ఘటనపై విచారణ చేస్తున్నట్టు చెప్పారు.

నీటి ప్రాజెక్టులకు గండం

... 5వ పేజీ తరువాయి

పంపింది. జీవీఎంసీ నుంచి బకాయి వసూలు చేసుకోవాలని మరోమారు ప్రభుత్వం తేల్చిచెప్పింది. రైవాడ, మేహాద్రిగెడ్డ, గంభీరం, తాటిపూడి రిజర్వాయర్ల నిర్వహణ, గేట్ల దుస్థితిపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం జల వనరుల శాఖను అప్రమత్తం చేసింది. తక్షణమే జీవీఎంసీ నుంచి కొంత మేర బకాయిలు రాబట్టుకుని నిర్వహణ పనులు చేపట్టాలని సూచించింది. కాగా రైవాడ, మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ ప్రాజెక్టుల నిర్వహణ గురించి జల వనరుల శాఖ విశాఖ సర్కిల్ ఎస్‌ఈ కేవీఎన్ స్వర్ణకుమార్ వద్ద ప్రస్తావించగా జీవీఎంసీ నుంచి నిధులు వచ్చిన వెంటనే మరమ్మతులు చేస్తామన్నారు. బకాయిలు విడుదల చేయాలని పదేపదే కోరుతున్నామని పేర్కొన్నారు.

బీఈడీ కాలేజీల ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

అనేక కాలేజీల్లో అర్హత కలిగిన సిబ్బంది ఉండడం లేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండా పోతోందంటున్నారు.

తరగతులకు హాజరుకాకపోయినా...

ఏటా బీఈడీ కోర్సుల్లో సుమారు ఐదు వేల మంది విద్యార్థులు చేరుతుంటారు. వారిలో దాదాపు రెండు వేల మంది తరగతులకు హాజరుకారంటే అతిశయోక్తి కాదు. బీఈడీ చేసేవారిలో ఎంతోమంది వేర్వేరు వ్యాపకాల్లో ఉంటారని, వారంతా ఆయా కాలేజీలకు ఫీజులు చెల్లించి పరీక్షలకు మాత్రమే హాజరవుతుంటారని చెబుతున్నారు. ఇటువంటి విద్యార్థుల నుంచి సదరు కాలేజీ యాజమాన్యాలు భారీగా ఫీజులు వసూలు చేస్తుంటాయన్నది జగమెరిగిన సత్యం. కాలేజీల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు, అకడమిక్ ఆడిట్‌లు నిర్వహించాల్సిన యూనివర్సిటీ అధికారులు చూసీచూడనట్టు వదిలేస్తుండడంతో ఇదో పెద్ద వ్యాపారంగా మారిందని చెబుతున్నారు.

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

పెందుర్తి, మే 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వెంకటాద్రి శిఖరంపై కొలువై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఐదు రోజులుగా జరుగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజు స్వామివారికి శ్రీచక్ర స్నానం నిర్వహించారు. అనంతరం ఆ జలాలను భక్తుల శిరస్సుపై చల్లారు. అలాగే స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు నిర్వహించి, భక్తులకు నిజరూప దర్శనం కల్పిం,చారు. సాయంత్రం పుష్పార్చన, ఊంజల్ సేవ జరిపారు.

వెంకన్నకు నేడు స్వర్ణ పుష్పార్చన

వేపగుంట, మే 9 (ఆంధ్రజ్యోతి): రవినగర్ శేషాద్రి కొండపై కొలువైన కల్యాణ వెంకన్న ఆలయంలో స్వామివారికి శనివారం స్వర్ణ పుష్పార్చన చేయనున్నట్టు అర్చకుడు శ్రీనివాస స్వామి తెలిపారు.

12న గిరి ప్రదక్షిణ

ఉక్కుటౌన్‌షిప్, మే 9 (ఆంధ్రజ్యోతి): వైశాఖ పౌర్ణమి సందర్భంగా సోమవారం ఉక్కునగరం వేంకటేశ్వర స్వామి గిరి ప్రదక్షిణ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. భక్తులు టార్చ్‌లైట్లు తేవాలని సూచించారు.

ఘనంగా అన్నమయ్య జయంతి

పెదగంట్యాడ, మే 9 (ఆంధ్రజ్యోతి): గరుడాద్రి వేంకటేశ్వరాలయంలో శుక్రవారం తాళ్లపాక అన్నమాచార్యులు జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. పొన్నాడ వెంకటకామేశ్వరమ్మ అన్నమయ్య వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి బీజేపీ నేత సుహాసిని ఆనంద్, వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసరావు పాల్గొని పూజలు చేశారు. జనసేన నేత లంక లత, న్యాయవాది వెంకటనాగేశ్వరరావు, సత్యారావు పాల్గొన్నారు.

11, 12న అప్పన్న ఆర్జిత సేవలు రద్దు

సింహాచలం, మే 9 (ఆంధ్రజ్యోతి): వార్షికోత్సవాల నేపథ్యంలో వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో 11, 12 తేదీలలో జరగనున్న ఆర్జిత సేవలు రద్దుచేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. ఈనెల 11న నృసింహస్వామి మాస జయంతి, 12న నమ్మాళ్వార్ తిరునక్షత్ర పూజలు, అప్పన్నస్వామికి రెండో విడత చందన సమర్పణ జరగనున్నాయి. ఈ సందర్భంగా సేవకాలం, పూజలు, విశేష ఉత్సవం నిర్వహించాల్సి ఉన్నందున నిత్యకల్యాణం, స్వాతినక్షత్ర హవనం, గరుడసేవ, సహస్ర నామార్చన రద్దు చేశారు. భక్తులు సహకరించాలని ఏఈఓ ఎన్.ఆనందకుమార్ కోరారు.

వెంకటరమణారెడ్డికి సత్కారం



రమణారెడ్డి దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

అగనంపూడి, మే 9 (ఆంధ్రజ్యోతి): తెలుగు వెలుగు ఉగాది మహా నంది జాతీయ పురస్కారాన్ని అందుకున్న కొయ్య వెంకటరమణారెడ్డి దంపతులను ప్రజా సంఘాల నేతలు శుక్రవారం ఘనంగా సత్కరించారు. సామాజిక సేవా రంగంలో రమణారెడి సేవలను గుర్తించి అవార్డును అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, పూర్ణానందశర్మ, మోటూరి వెంకటరమణ, మజ్జి శ్రీను, గుదే గజేంద్రరావు, నక్కా రమణబాబు, బి.సత్యనారాయణ, గొల్లవిల్లి వెంకటరావు, వ్యాసశర్మ, శంభుడు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శారద, శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్** : జగదాంబ, సంగం, శ్రీరామ, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 14, వంకాయలు (తెలుపు)36, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 22, పచ్చిమిర్చి 22, కాకరకాయలు 36, బీరకాయలు 36, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 15, క్యారెట్ 40 దొండకాయలు 24, బంగాళదుంపలు 20, అరటికాయ 9, మునక్కాడలు (కిలో) 54, అల్లం46, బరబాటి 34, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 48, దోసకాయలు 18, వెల్లుల్లి 100, కొబ్బరికాయ 25, బీన్స్ 84, కీరదోస 36, కాప్సికమ్ 48, పొట్లకాయ 28, చేమదుంపలు 30చిలగడదుంపలు 38, కంద 80, దేముడుచిక్కుడు 44, గోరుచిక్కుడు 30, కూరపెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు(కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిదగుమ్మడికాయ 30, క్రరపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	120
లైవ్ ధర	140
విత్ స్కిన్	250
స్కిన్‌లెస్	260

వైసీపీ హయాంలో యువత నిస్తేజం

- గత పాలకుల తప్పులతోనే బెట్టింగ్ జోలికి
- హోం మంత్రి వంగలపూడి అనిత
- పెందుర్తిలో జాబ్ మేళాకు అనూహ్య స్పందన

పెందుర్తి, మే 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ఉపాధి కల్పన లేక నిరుద్యోగ యువత బెట్టింగ్ జోలికి వెళ్లిందని హోం మంత్రి వంగలపూడి అనిత విమర్శించారు. అర్హులందరికీ ఉపాధి కల్పన లక్ష్యంగా పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఆధ్వర్యంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సౌజన్యంతో శుక్రవారం పెందుర్తి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాను మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి అందించే ధ్యేయంతో ప్రతి మూడు నెలలకూ రాష్ట్రంలోని అన్ని నియోజకవరాల్లో జాబ్‌మేళాలు నిర్వహిస్తోందన్నారు. కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో యువత ఉద్యోగావకాశాలు అందిపుచ్చుకోవాలంటే సృజనాత్మకత, నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. నగర మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు చొరవతో అనేక కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్రానికి తరలివస్తున్నాయని దీంతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ సృజన, నైపుణ్యతకు వేదిక కల్పిస్తే యువత మరో ప్రపంచాన్ని సృష్టిస్తారన్నారు. టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ మాట్లాడుతూ విలువలు తెలుసుకుని ఉపాధి బాట బట్టాలన్నారు. అనంతరం పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను మేళాలో పాల్గొన్న కంపెనీల హెచ్‌ఆర్‌లను మంత్రి సత్కరించారు. అంతకుముందు సిందూర్ ఆపరేషన్‌లో అమరులైన జవాన్లకు నేతలు నివాళులర్పించారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు చాముండేశ్వరరావు, గోవింద్, ఉపాధి అధికారి సుబ్బిరెడ్డి, జెడ్పీ హైమావతి, కార్పొరేటర్లు సేనాపతి వసంత శంకరరావు, మొల్లి ముత్యాలు, నేతలు సింహాచలం, దివాకర్, పరమేశ్వరరావు, అప్పారావు, అజయ్, దేవుడు, శ్రీను పాల్గొన్నారు.



జాబ్ మేళాలో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత



ఉద్యోగాలు పొందిన వారితో ఎమ్మెల్యే పంచకర్ల

826 మందికి ఉద్యోగాలు

మేళాలో 45 కంపెనీలు పాల్గొన్నాయి. మూడు వేల మంది యువత హాజరు కాగా టెక్ మహీంద్ర, యుకోమా, హెట్రో, టాటా ట్రెంట్, తదితర కంపెనీలతో పాటు మరో 45 సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 826 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. మరో 238 మందిని పరిశీలనలో ఉంచారు. ఎంపికైన వారికి ఎమ్మెల్యే రమేశ్‌బాబు నియమాక పత్రాలు అందించారు.

ఘనంగా ఎమ్మెల్యే గణబాబు జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యే గణబాబుకు జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు, అభిమానులు

గోపాలపట్నం/ సింహాచలం, మే 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు జన్మదిన వేడుకలు గోపాలపట్నంలోని ఆయన నివాసంలో శుక్రవారం ఘనం గా జరిగాయి. అభిమానులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయ పండితులు వేద స్వస్తి వచనాలతో ఆశీర్వచనాలు అందజేశారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి చతుర్వేదాలతో ఆశీర్వచనాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఎన్.ఆనంద కుమార్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ 78వ వార్డు నూతన కార్యవర్గం



టీడీపీ 78వ వార్డు నూతన కార్యవర్గం

ఉక్కుటౌన్‌షిప్, మే 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 78వ వార్డు తెలుగుదేశం పార్టీ నూతన కార్యవర్గం శుక్రవారం గాజువాక టీడీపీ కార్యాలయంలో జరిగింది. పార్టీ రాష్ట్ర పరిశీలకుడు ఎంవీఎస్ చౌదరి నేతృత్వంలో వార్డు క్లస్టర్ ఇన్‌చార్జిగా అడుసుమల్లి దీప్తి, అధ్యక్షుడిగా కొల్లి శివనాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా అరుగుల మణికుమార్, ఉపాధ్యక్షునిగ ఎంవీ రవివర్మ, కోశాధికారిగా త్రిమూర్తులు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వై.వెంకటేశ్వరరావు, వై.గిరిలను నియమించారు. పార్టీ మరింత బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

మేయర్‌ను కలిసిన టీడీపీ నాయకులు



మేయర్‌తో పెదగంట్యాడ నేతలు

పెదగంట్యాడ, మే 9 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ నూతన మేయర్‌గా ఎన్నికైన పీలా శ్రీనివాసరావును పెద గంట్యాడ టీడీపీ నాయకులు శుక్రవారం ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఆయన్ని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మేయర్‌ను కలిసిన వారిలో టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దాడ సోమునాయుడు, స్టీల్ ప్లాంట్ ఓబీసీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీముసురు శ్రీనివాసరావు, టీడీపీ 75వ వార్డు కార్యదర్శి దొమ్మేటి పెరుమాళ్లు, ప్రముఖ న్యాయవాది వి.ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

పెందుర్తిలో 22 మంది జూదరుల అరెస్టు

పెందుర్తి, మే 9 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి పరిధిలో రెండు చోట్ల జూదం ఆడుతున్న 22 మందిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. సీఐ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సిల్వర్ బ్రిడ్జి వద్ద కాయన్‌గేమ్ ఆడుతున్నట్టు సమాచారం రావడంతో ఎస్ఐ ఆర్.అసిరితాత సిబ్బందితో కలిసి దాడి చేసి పది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.24 వేలు నగదు, మూడు రూపాయి నాణేలు, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నందమూరినగర్ మామిడితోటలో పేకాట ఆడుతున్న 12 మందిని ఎస్ఐ చింతలస్వామినాయుడు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.25 వేల నగదు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

'ఎనర్జీ అసిస్టెంట్లను ఎస్‌ఈబీలో విలీనం చేయాలి'

విశాఖపట్నం, మే 9(ఆంధ్రజ్యోతి): సచివాలయం లోని ఎనర్జీ అసిస్టెంట్లను ఏపీ ఎస్‌ఈబీ నార్మ్స్ ప్రకారం డిపార్టమెంట్లో విలీనం చేయాలని ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.రాజు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటు ఎనర్జీ అసిస్టెంట్‌లు సమ్మెకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత సచివాలయాల్లో మార్పులు చోటుచేసుకున్నాయని, అన్ని విభాగాలకు వాటి మదర్ డిపార్టమెంట్లు చర్యలు తీసుకున్నా, ఎనర్జీ విభాగంలో చర్యలకు కమిటీలు వేయడంతోనే కాలం గడిచిపోతోందన్నారు.

ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీ



శాతవాహన నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు



పెదగంట్యాడలో సిందూర్ విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కూర్మన్నపాలెం, మే 9 (ఆంధ్రజ్యోతి): పాక్ ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసిన భారత్ సైన్యానికి మద్దతుగా 86వ వార్డులోని శాతవాహన నగర్‌లో శుక్రవారం ఆర్‌ఆర్ వాకర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో బీజేపీ జిల్లా కార్యదర్శి బొండా ఎల్లాజీరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు ఆపరేషన్ సిందూర్ ద్వారా దాడులు నిర్వహించి, పాకిస్థాన్‌కు తగిన బుద్ధి చెప్పారన్నారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా భారతీయులందరూ భారత సైన్యానికి, పీఎం మోదీకి మదతుగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నేతలు భాస్కరరావు, మూర్తి, శ్రీనివాస్, బ్రహ్మం, జగన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడలో...

పెదగంట్యాడ, మే 9 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌పై భారత్ సైన్యం చేసిన సిందూర్ ఆపరేషన్ విజయవంతం కావడంతో పెదగంట్యాడలోని బీజేపీ, బీఎంఎస్, ఆర్‌ఎస్‌ఎస్, మాజీ సైనికులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పాకిస్తాన్‌లోని ఉగ్రవాద శిబిరాల ధ్వంసం, అనంతరం జరిగిన దాడుల్లో అమరులైన భారత వీరులను స్మరించుకుంటూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం పెదగంట్యాడ పురవీధుల్లో త్రివర్ణ పతాకాలు ఎగరవేస్తూ ర్యాలీ నిర్వహించారు. బాలచెరువు జంక్షన్ నుంచి ప్రారంభమైన విజయోత్సవ ర్యాలీ నెల్లిముక్కు, సీతానగరం, పెదగంట్యాడ, దుర్గవానిపాలెం, సిద్ధేశ్వరం, బీసీ రోడ్డు, ప్రాంతాల నుంచి సాగి తిరిగి బాలచెరువు జంక్షన్‌కు చేరుకుంది. కార్యక్రమంలో బీజేపీ 76వ వార్డు బీజేపీ అధ్యక్షుడు జీలకర్ర రమణ, మహిళామోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జి.భువనేశ్వరి, స్టీల్‌ప్లాంట్ బీఎంఎస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గొందేశి గురప్పరెడ్డి, బీజేపీ నేతలు ఎం.తులసీదాస్, మాజీ సైనికులు పులి అప్పలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో వాటర్ స్పోర్ట్స్‌కు పూర్వ వైభవం

- శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు

సాగర్‌నగర్, వే ౨9 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రుషికొండ ప్రాంతంలో నిర్వీర్యమైన వాటర్ స్పోర్ట్స్‌కు పూర్వ వైభవం తీసుకువస్తామని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. రుషికొండలో డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో కెనాయింగ్ అండ్ కయాకింగ్ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన వాటర్‌స్పోర్ట్స్ సమ్మర్ కోచింగ్ క్యాంపును శుక్రవారం ఆయన ప్రారంభించారు. వాటర్ స్పోర్ట్స్ నిర్వహిస్తున్న డీఎస్ఏ ల్యాండ్ పరిశీలించిన అనంతరం క్రీడాకారులతో కలసి బోట్‌రేసింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ వేదికగా వాటర్ స్పోర్ట్స్ అభివృద్ధి చేయాలని 2002లోనే అప్పటి సీఎం చంద్రబాబునాయుడు భావించి ఆచరణలో పెట్టడంతో పాటు 2019 వరకు సమర్థగా నిర్వహించామన్నారు. వైసీపీ హయాంతో వాటర్ స్పోర్ట్స్ నిర్వీర్యమైందన్నారు. డీఎస్ఏ పరిధిలోని దీని నిర్వహణకు కేటాయించిన స్థలాన్ని సైతం జగన్ కబ్జా చేశారన్నారు. ఈ సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లగా డీఎస్ఏ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారన్నారు. ఇది క్రీడ మాత్రమే కాదని ఆపత్కాలంలో ప్రాణాలను కాపాడే బాధ్యతయుతమైన వరమన్నారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ జూన్, బలరామ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



బోటురేసింగ్‌లో పాల్గొన్న శాప్ చైర్మన్ రవినాయుడు

ప్రీ పెయిడ్ ఆటోస్టాండ్లు ఏర్పాటు చేయరా?

- వినతులు పట్టించుకోని అధికారులు
- దువ్వాడ రైల్వే స్టేషన్ వద్ద అధిక చార్జీలపై ప్రయాణికుల ఆవేదన

కూర్మన్నపాలెం, మే 9 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ రైల్వే స్టేషన్ వద్ద ప్రీపెయిడ్ ఆటోస్టాండులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, ప్రజాసంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. ఇక్కడ ప్రీపెయిడ్ ఆటోస్టాండు ఏర్పాటు చేయాలన్న డిమాండ్ దీర్ఘకాలంగా ఉన్నా అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ప్రీపెయిడ్ ఆటోస్టాండు లేక పోవటం వల్ల కొంత మంది ఆటోడ్రైవర్లు రైలు ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆటోడ్రైవర్లు ఇష్టారాజ్యంగా వ్యవరిస్తున్నారని అంటున్నారు. ముఖ్యంగా రాత్రి 9 గంటలు దాటాక దువ్వాడ రైల్వేస్టేషన్ నుంచి రాజీవ్ నగర్, కూర్మన్నపాలెం రావాలన్నా కనీసం రూ.200కు తగ్గకుండా డిమాండ్ చేస్తున్నారని పలువురు ప్రయాణికులు అంటున్నారు. ఆటోల చార్జీల భారం తప్పాలంటే ప్రీపెయిడ్ ఆటోస్టాండు ఉంటే ప్రయాణికులకు న్యాయం జరుగుతుందని దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కంచుమూర్తి ఈశ్వర్ గతంలో ఉన్నతాధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేశారు. ఇప్పటికైనా అధికారులు ఇక్కడ ప్రీ పెయిడ్ ఆటో స్టాండ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



దువ్వాడ రైల్వే స్టేషన్ వద్ద ఆటోలు

సింహాచలం రైల్వేస్టేషన్‌లో పోలీసుల తనిఖీలు



రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

గోపాలపట్నం, మే 9 (ఆంధ్ర జ్యోతి): భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. గోపాలపట్నం సీఐ గొలగాని అప్పారావు, ఎస్ఐ అప్పలనాయుడు, సిబ్బంది ప్రధాన కూడళ్లలో వాహనాల తనిఖీ చేపడుతున్నారు. పీఎస్ పరిధిలోని బస్టాండ్, రైల్వేస్టేషన్, లాడ్జీలతో పాటు అన్ని ముఖ్యమైన ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టి తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనుమానితులు కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని సీఐ అప్పారావు కోరారు.

ప్రజా దర్బార్‌తో సమస్యల పరిష్కారం

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ



వినతులు స్వీకరిస్తున్న గండి బాబ్జీ

పెందుర్తి, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను తెలుసుకుని పరి ష్కరించడానికే ప్రభుత్వం ప్రజా దర్బార్ ఏర్పాటు చేసిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ అన్నారు. శుక్రవారం పెందుర్తిలోని టీడీపీ కార్యాలయంలో ఆయన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 40 వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చిన ఫిర్యాదులను కంప్యూటరీకరణచేసి, ముఖ్యమంత్రి డాష్ బోర్డుకు పంపిస్తామని. ఫిర్యాదుదారులకు సీఎం కార్యాలయం నుంచే కాల్ చేసి సమస్యను పరిష్కరిస్తారని చెప్పారు. అనంతరం సబ్బవరం మండల టీడీపీ కమిటీతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కుటుంబ సాధికార సారథులు, పార్టీ మండల కమిటీ, గ్రామ కమిటీల నియామకాలపై నాయకులకు పలు సూచనలు చేశారు.

వెంకట జగదీష్‌కు లెజెండరీ అవార్డు



అవార్డు అందజేస్తున్న తెలంగాణ మంత్రి ఉత్తమకుమార్ రెడ్డి

విశాఖపట్నం, మే 9 (ఆంధ్రజ్యోతి): ఓటీఎస్ అడ్వర్టైజింగ్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వెంకట జగదీష్ నల్లూరికి హైబిజ్ టీడీ మీడియా అవార్డ్స్ 2025 లో లెజెండరీ అవార్డు లభించింది. మీడియా, ప్రకటన రంగానికి ఆయన చేసిన అసాధారణ సేవలను గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేశారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో తెలంగాణ నీటి పారుదల శాఖా మంత్రి ఉత్తమకుమార్‌రెడ్డి ఈ అవార్డును అందజేశారు. సుమారు 40 ఏళ్లకు పైగా అనుభవంతో వెంకట జగదీష్ ప్రాంతీయ ప్రకటన రంగంలో కీలకపాత్ర పోషించారు. ఆయన సారథ్యంలో ఓటీఎస్ అడ్వర్టైజింగ్ ప్రముఖ సంస్థగా ఎదిగి మౌలిక సదుపాయాలు, పరిపాలన, విద్య, ఆరోగ్య రంగాల్లో సమగ్ర ప్రచారాలు చేసింది. ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయడం, ప్రభుత్వ సమాచారాన్ని సమర్థంగా ప్రజలకు చేర్చడంలో విజయవంతమయ్యారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు



మాట్లాడుతున్న ప్రసాదుల శ్రీనివాస్

గాజువాక, మే 9 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్‌కార్డు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని టీడీపీ గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడుతూ గత ప్రభుత్వం రేషన్ కార్డుల జారీకి ఆంక్షలు విధించిందన్నారు. ఇంటి పన్ను, విద్యుత్ పన్ను, వాహనాలను పరిగణనలోకి తీసుకోకూడదన్నారు. మధ్య తరగతి ఇళ్లలోనూ ఏసీలున్నాయని, వాటిని పరిగణనలోకి తీసుకోరాదన్నారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు నేతృత్వంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, బొడ్డు నరసింహపాత్రుడు, రాజాన రామారావు, నాయకులు పులి వెంకటరమణారెడ్డి, ఎండీ.రఫీ పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

మల్కాపురం, మే 9 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో స్విగ్గీలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శ్రీహరిపురం శ్రీనివాసనగర్‌లో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీనివాసనగర్‌కు చెందిన కిరణ్‌కుమార్ (39) స్విగ్గీలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల ఇతడి భార్య బంధువుల ఇంట్లో పెళ్లి కోసం ఒడిశాలోని బరంపురం వెళ్లింది. ఆర్థిక ఇబ్బందులతో సతమవుతున్న కిరణ్ ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకున్నాడు. దుర్వాసన వస్తుండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు చూసేరికి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, హెచ్‌సీ పీవీ స్వామి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో ఒకరు...

ఎంవీపీ కాలనీ, మే 9 (ఆంధ్రజ్యోతి): భార్యతో తలెత్తిన చిన్న తగాదా కారణంగా తీవ్ర మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎంవీపీ ఎస్ఐ కాదర్ బాషా తెలిపిన వివరాల మేరకు.. హెచ్‌బీ కాలనీ దుర్గానగర్‌లో కొండ్రు రమణ(45) భార్య, ఇద్దరు పిల్లలతో ఉంటున్నాడు. దంపతుల మధ్య తరచూ ఘర్షణలు జరుగుతుండేవి. ఈ క్రమంలో గురువారం రాత్రి కూడా బాగా గొడవ జరగడంతో మనస్తాపానికి గురైన రమణ ఇంటి స్లాబ్‌కు ఉన్న ఇనుప రాడ్డుకు చీరతో ఉరి వేసుకున్నాడు. గమనించిన కుమారుడు నానమ్మకు ఫోన్‌లో విషయం తెలియజేయడంతో, భీమిలి కంచేరుపాలెంలో ఉంటున్న కొండ్రు చిన్నమ్మ వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసింది. హెచ్‌సీ నూకరాజు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వార్డు కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడికి అభినందన


ఎమ్మెల్యే వంశీకృష్ణతో గణేష్‌కుమార్

మహారాణిపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): వార్డు పరిపాలన కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంపికైన విశాఖకు చెందిన పి.జె.గణేష్‌కుమార్‌ను దక్షిణ శాసన సభ్యుడు వంశీకృష్ణ అభినందించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో కీలకపాత్ర పోషించాలని సూచించారు. కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సంఘం నాయకులు చింతకాయల బంగారు రాజు, బీవీ అశోక్ కుమార్, డి.శివనారాయణ, ఎస్.సాయికృష్ణ, డి.రవితేజ, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో ఇస్కాన్ సంస్థ ఉచితంగా మజ్జిగ పంపిణీ

మహారాణిపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవలో భాగంగా రోగులు, వారి సహాయకుల దాహార్తి తీర్చేందుకు ఇస్కాన్ సంస్థ (సాగర్‌నగర్) కేజీహెచ్‌లో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టింది. శుక్రవారం అవుట్ పేషెంట్ విభాగం వద్ద పంపిణీ కేంద్రాన్ని ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస ప్రభూజీ, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్‌లు ప్రారంభించారు. రోజుకు సుమారు రెండు వేల కప్పుల మజ్జిగను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

జిల్లా చదరంగం పోటీలు రేపు

విశాఖపట్నం స్పోర్ట్స్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఆల్ వైజాగ్ చెస్ సంఘం, క్యాండిడ్ నైట్స్ చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 11న జిల్లా అండర్-11 ఓపెన్ బాలుర, బాలికల చదరంగం పోటీలు నిర్వహిస్తామని ఆల్ వైజాగ్ చెస్ సంఘం కార్యదర్శి ఎస్.మణికంఠరావు తెలిపారు. గాజువాక లయన్స్ క్లబ్‌లో జరిగే ఈ టోర్నీలో పాల్గొనే చిన్నారులు జనవరి ఒకటి, 2014న లేదా ఆ తర్వాత పుట్టినవారై ఉండాలని స్పష్టం చేశారు. ఈ పోటీల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచినవారు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నీలో ప్రాతినిధ్యం వహిస్తారని, మరిన్ని వివరాలకు ఫోన్:7010319715, 9849371760 నందు సంప్రదించాలన్నారు.

ఉపాధి కోర్సుల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కంచరపాలెం, మే 9 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం బాలికల ఐటీఐ ప్రాంగణంలో నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్ వద్ద జులై నుంచి ప్రారంభం కానున్న ఉపాధి శిక్షణ (కాంపిటీటివ్) కోర్సుల్లో చేరేందుకు అర్హులైన ఎస్సీ, ఎస్టీ యువత నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఉప ప్రాంతీయ ఉపాధి కల్పనాధికారి శ్యాంసుందర్ నిట్టల పేర్కొన్నారు. ఉచిత శిక్షణకు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. పోటీపరీక్షలు సహా కంప్యూటర్ 'ఒ' లెవల్ సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌లలో శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ సమయంలో నెలకు రూ.వెయ్యి స్టైఫండ్ చెల్లిస్తామన్నారు. అభ్యర్థులు కనీసం ఇంటర్ చదివి 18 నుంచి 27 ఏళ్ల మధ్య వయసువారై ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి మే 31 వరకు గడువు ఉంది. మరిన్ని వివరాలకు 0891-2788700 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని శ్యాంసుందర్ కోరారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, మే 9 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని అతని నుంచి రూ.50 వేల విలువ చేసే పది కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఒడిశాకు చెందిన బలరామ్ సాహు అనే నిందితుడు గుజరాత్‌కు గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డాడు. అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

మత్స్య పరిశ్రమ అభివృద్ధికి కృషి: మంత్రి అచ్చెన్నాయుడు


మంత్రి అచ్చెన్నాయుడును సన్మానిస్తున్న మరపడవల సంఘం నాయకులు

మహారాణిపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో చేపల వేట సాగించే మత్స్యకారులకు మరింతగా చేయూత అందిస్తామని రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. త్వరలోనే మత్స్యపరిశ్రమ కమిషనర్‌తో కలసి ఫిషింగ్ హార్బర్‌ను సందర్శించి అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. ప్రభుత్వం మత్స్యపరిశ్రమను తప్పక ప్రోత్సహిస్తుందని భరోసా ఇచ్చారు. మరపడవల సంఘం ప్రతినిధులు శుక్రవారం మంత్రి అచ్చెన్నాయుడును కలిసి మత్స్య పరిశ్రమ అభివృద్ధికి సహకరించాలని అభ్యర్థించినప్పుడు ఆయన పైవిధంగా హామీ ఇచ్చారు. మెకనైజ్‌డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్ల సంఘం అధ్యక్షుడు షైలపల్లి లక్ష్మణరావు ఆధ్వర్యంలో పలువురు ప్రతినిధులు మంత్రికి వినతిపత్రాన్ని అందించి వారి సమస్యలను విన్నవించుకున్నారు. సముద్రంలో చేపల వేట నిషేధ ఆరంభ సమయంలోనే రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల జీవన భృతిని అందించినందుకు కృతజ్ఞతగా మంత్రికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ ఆయిల్ సబ్సిడీ మొత్తం చెల్లించాలని, మునిగిన బోట్ల యజమానులకు నష్టపరిహారం, డీజిల్‌కు ప్రస్తుతం చెల్లిస్తున్న తొమ్మిది రూపాయలను రూ.15లకు పెంచాలని కోరారు. ఫిషింగ్ హార్బర్‌లో మత్స్య పరిశ్రమకు, మత్స్యకారులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని అభ్యర్థించారు. మంత్రిని కలిసినవారిలో సంఘం గౌరవ అధ్యక్షుడు పి.సి.అప్పారావు, సురపతి నరసింగరావు, గనగల రాజేష్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మురళీనాయక్ త్యాగానికి జోహార్లు



రైల్వేన్యూకాలనీలో నిర్వహించిన శాంతిర్యాలీలో పాల్గొన్న స్థానికులు

డాబాగార్డెన్స్/అక్కయ్యపాలెం, మే 9 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్ యుద్ధభూమిలో ఆపరేషన్ సిందూర్‌లో పోరాడుతూ మన రాష్ట్రానికి చెందిన మురళీ నాయక్ వీరమరణం పొందడం గుండెను కలచివేసిందని దక్షిణ ఎమ్మెల్యే సీహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ఆయన చూపిన ధైర్యం, సాహసం రాష్ట్రానికే గర్వకారణమన్నారు. ఆయన త్యాగం ఎప్పటికీ మరిచిపోలేనిదన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేస్తున్నానన్నారు. భారత్-పాక్ యుద్ధంలో వీర మరణం పొందిన జవాను మురళీ నాయక్‌కు గ్రేటర్ 42వ వార్డు ప్రజలు శుక్రవారం సాయంత్రం ఘనంగా నివాళులర్పించారు. రైల్వే న్యూకాలనీలో జాతీయ పతాకాలు చేత పట్టుకొని శాంతి ర్యాలీ చేశారు. ఇందులో వార్డు బీజేపీ అధ్యక్షుడు గురుగోవింద్ సింగ్, ప్రకాశ్ రెడ్డి, శ్రీకృష్ణ, జయరామ్ పాల్గొన్నారు.

'టెండర్లు రద్దు చేయండి'


పోర్టు ఆసుపత్రి ఎదుట నిరసన దీక్షలో నినదిస్తున్న నాయకులు

అక్కయ్యపాలెం, మే 9 (ఆంధ్రజ్యోతి): పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణ టెండర్లు వాయిదా వేయడం కాకుండా రద్దు చేయాలని యునైటెడ్ పోర్టు, డాక్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు జె.సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆసుపత్రిని ప్రైవేటీకరించవద్దని చేస్తున్న నిరసన దీక్షలు శుక్రవారానికి 221వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 8న తెరవాల్సిన టెండర్‌ను 12వ తేదీకి వాయిదా వేశారని, కానీ రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వ నిర్ణయం పూర్తిగా ఉద్యోగుల హక్కులను, వారి కుటుంబాల ఆరోగ్య భద్రతను క్షీణింపజేసేదిగా ఉందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.సత్యనారాయణ త్రినాథరావు, రాము పాల్గొన్నారు.

దేశీయ విత్తనాలతో పండే పంటలే ఆరోగ్యకరం


చిరుధాన్యాలు, విత్తనాలను ప్రదర్శిస్తున్న నిర్వాహకులు

సీతంపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): దేశీయ విత్తనాలతో పండే పంటలే ఆరోగ్యకరమని గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జె.వి. రత్నం పేర్కొన్నారు. గ్రీన్ క్లైమేట్ ఆధ్వర్యంలో వరికంకుల గుత్తులు, తోరణాల తయారీపై శిక్షణ, విత్తనాల ప్రదర్శన కార్యక్రమాన్ని ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రత్నం మాట్లాడుతూ కూరగాయలు, ఆకుకూరల విత్తనాలు 130 రకాలు ప్రదర్శనలో ఉంచామని, దేశీయ విత్తనాల సేకరణ, పునరుత్పత్తికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆరోగ్యకరమైన ఆహారం భుజించాలని సూచించారు. మంచి విత్తనాలు దాచుకుంటూ వస్తున్న వారి వద్దకు వెళ్లి ఈ దేశీయ విత్తనాలు సేకరించామన్నారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందన్నారు. ప్రదర్శనలో తోటకూరలో వివిధ రకాలు, ఆరు రకాల వంగ, బీర, పొట్ల, బెండ, బీట్‌రూట్, కాల్యారెట్, ముల్లంగి, అనప, కాకర, చిక్కుడు, ఉల్లి, చిరుధాన్యాలు, పప్పు ధాన్యాలు, పాలకూర, చుక్కకూర, మెంతులు, ధనియాలు, మిర్చి, టమాటా, బొప్పాయి, బచ్చలి కూర, గుమ్మడి రకాలను ప్రదర్శనలో ఉంచారు. ఈ కార్యక్రమంలో బయోడైవర్సిటీ బోర్డు రీజనల్ ఎగ్జిక్యూటివ్ జానకిరావు, జీవీఎంసీ ఎస్ఆర్‌యు ప్రతినిధులు దివ్య, ప్రమీల, మంగరాజు, ఏవీఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అర్చన, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పురుషుల కబడ్డీ టోర్నీ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ తదితరులు

విశాఖపట్నం స్పోర్ట్స్, మే 9 (ఆంధ్రజ్యోతి): కబడ్డీ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పురుషుల కబడ్డీ చాంపియన్‌షిప్ టోర్నీ సోమవారం ప్రారంభం కానుంది. దీనికి సంబంధించి ప్రచార పోస్టర్‌ను దక్షిణ శాసనసభ్యుడు సీహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. పోటీలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. బొర్రా పైడితల్లమ్మ అమ్మవారి పండుగ సందర్భంగా గంట్యాడ మండలం పెంట శ్రీరామపురంలో పోటీలు నిర్వహించడం విశేషమని పేర్కొన్నారు. మూడు రోజులు జరిగే ఈ టోర్నీలో రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల జట్లు పాల్గొంటుండడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కబడ్డీ సంఘం ఉపాధ్యక్షుడు అవనపు విజయ్, కార్యనిర్వాహక కార్యదర్శి ఉరుకూటి శ్రీనివాసరావు, జిల్లా సంఘం కార్యదర్శి కోటేశ్వరరావు, విజయనగరం జిల్లా సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణ, పల్లా రమణ, శివ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ధ్యేయంగా పనిచేయాలి


చీపుర్లు అందిస్తున్న కార్పొరేటర్ వీరారావు

దొండపర్తి, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణ మన కర్తవ్యంగా భావించాలని పారిశుధ్య కార్మికులకు జోన్-3 జోనల్ కమిషనర్ శివప్రసాద్ సూచించారు. గ్రేటర్ 27వ వార్డు పరిధిలోని రోడ్లన్నీ పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మాధురితో కలిసి శుక్రవారం వార్డులోని పలు ప్రాంతాలను పర్యటించారు. అనంతరం మాట్లాడుతూ పారిశుధ్య పనితీరు మెరుగుపరుచుకోవాలని చెప్పారు. అన్ని ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్‌లా 15 రోజులు సమయం పెట్టుకొని ప్రతి రోడ్డు, వీధులలో సచివాలయం పరిధులలో కాల్వలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం కార్మికులకు చీపుర్లు పంపిణీ చేశారు. వార్డు టీడీపీ అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మీ శివప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి సీపీఐ జిల్లా మహాసభలు


మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

అల్లిపురం/సీతమ్మధార, మే 9 (ఆంధ్రజ్యోతి): సీపీఐ విశాఖ జిల్లా 25వ మహాసభల సందర్భంగా శనివారం సాయంత్రం 4 గంటలకు కంచరపాలెం మెట్టు నుంచి పాత ఐటీఐ వరకు ప్రజా ప్రదర్శన అనంతరం సభ జరుగుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు తెలిపారు. ఈ సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కె. రామకృష్ణ, సహాయ కార్యదర్శులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు, జేవీ సత్యనారాయణమూర్తి తదితరులు ప్రసంగిస్తారన్నారు. మహా సభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా సమితి సభ్యులు పడాల గోవింద్ పేర్కొన్నారు. సీతమ్మధార కూడలిలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పడాల గోవింద్ మాట్లాడుతూ ఐటీఐ జంక్షన్‌లో నిర్వహించే బహిరంగ సభలో కార్మికులు, కర్షకులు, మహిళలు, యువకులు పాల్గొనాలని కోరారు. 11న మాధవధారలో ప్రతినిధుల సభ జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించి పోరాట కార్యాచరణను రూపొందిస్తామన్నారు. సీపీఐ నాయకులు మధురెడ్డి, రావి అశోక్, లక్ష్మణ్‌రెడ్డి పాల్గొన్నారు.

చీటీల పేరుతో మోసగించిన దంపతుల అరెస్టు

మహారాణిపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): చీటీల పేరుతో ప్రజల నుంచి రూ.కోట్లు కట్టించుకొని వాటిని తిరిగి ఇవ్వకుండా పరారైన కేసులో దంపతులను అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో వెదురుపాక వినయ్‌కుమార్, అతని భార్య పావని చీటీలు నిర్వహించారు. దిలీప్ జైన్ అనే వ్యక్తి వద్ద రూ.కోటి కట్టించుకొని తిరిగి ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నారు. ఈ క్రమంలో జైన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులకు ఆరిలోవ పరిధిలోని శ్రీకాంత్ నగర్‌లో శుక్రవారం వీరు పట్టుబడ్డారు. విచారించిన అనంతరం ఈ దంపతులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరు అనేక మందికి చీటీల డబ్బులు కోట్లాది రూపాయలు చెల్లించాల్సి ఉందని అనుమానిస్తున్నారు.

వంశీనగర్ గెడ్డ ముంపు సమస్య ఎట్టకేలకు పరిష్కారం


గెడ్డ దగ్గర పనులు పర్యవేక్షిస్తున్న ఏఎంహెచ్ఓ సునీల్ శానిటరీ ఇన్‌స్పెక్టరు సుధాకర్ తదితరులు

మురళీనగర్, మే 9 (ఆంధ్రజ్యోతి): వంశీనగర్ నివాసిత ప్రాంతం వద్ద సమస్యాత్మకంగా మారిన గెడ్డ ప్రాంతాన్ని జోన్-5 ఏఎంహెచ్ఓ సునీల్‌కుమార్ శుక్రవారం సందర్శించి, ముంపు సమస్యను పరిష్కరించారు. రాజమండ్రి ప్రాంతం నుంచి ప్రత్యేక పూడిక తీసే బృందాల్ని తీసుకొచ్చి గెడ్డలోని వ్యర్థాలను తొలగించారు. మెషీన్లు, మోటార్లు వినియోగించి గెడ్డలో మురుగునీరు బయటకు తీశారు. శానిటరీ సూపర్‌వైజరు జనార్దన్, శానిటేషన్ ఇన్‌స్పెక్టరు సుధాకర్ తదితరులు పనులను పర్యవేక్షించారు. ఇంజనీరింగ్ విభాగం సహాయంతో గెడ్డకు శాశ్వత పరిష్కారం కల్పించాలని ఇటీవల గెడ్డ ప్రాంతాన్ని పరిశీలించిన ఉత్తర నియోజకవర్గ శాసనసభ్యుడు పి.విష్ణుకుమార్‌రాజు ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో పనుల్లో పురోగతి వచ్చింది. ఎట్టకేలకు నివాసితులకు ముప్పు లేకుండా గెడ్డ నీటిని, వ్యర్థాల్ని తొలగించారు. సమస్య మళ్లీ రాకుండా చూస్తామని శానిటేషన్ అధికారులు ఏఎంహెచ్ఓ సునీల్‌కుమార్‌కు నివేదించారు. 50వవార్డు టీడీపీ అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

వైభవంగా అనంతుని ఆలయ శిఖర ప్రతిష్ఠ


కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గంటా


విమాన శిఖరంపై వేసిన బూర్లెను పడుతున్న భక్తులు

పద్మనాభం, మే 9 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని గిరిపై అనంత పద్మనాభుని ఆలయ శిఖర ప్రతిష్ఠ శుక్రవారం అంగరంగ వైభవంగా సాగింది. దేవస్థానం, ఉత్సవ కమిటీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ముందుగా ఆలయ ప్రధాన అర్చకుడు పి. సీతారామాంజనేయస్వామి ఆధ్వర్యంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అగ్ని ధ్యానం, ఉక్త హోమం, అంత హోమం చేసి, పూర్ణాహుతి చేపట్టారు. అనంతరం రత్న న్యాసం, ధాతు న్యాసం, బీజా న్యాసం చేసి విమాన శిఖర ప్రతిష్ఠను భక్తుల జయ, జయ ధ్వానాల మధ్య నిర్వహించారు. విమాన శిఖరంపై పూసిన బూర్లెను భక్తులు పట్టారు. మహాసంప్రోక్షణలో భాగంగా కళావాహన, ప్రథమార్చన, గోదర్శనం, శాంతి కల్యాణం, మహదాశీర్వచనం, ప్రసాద వితరణ చేపట్టారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ఈఓ నానాజీబాబు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ మాజీ ఛైర్మన్ అక్కరమాని విజయనిర్మల, వెంకటరావు దంపతులు, భీమిలి నియోజకవర్గం జనసేన ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్, విజయనగరం జనసేన నాయకుడు అవనాపు విక్రమ్, విజయనగరం జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, వైసీపీ సీనియర్ నాయకులు కేకే రాజు, ఎంపీపీ రాంబాబు, జెడ్పీ వైస్ ఛైర్మన్ గిరిబాబు, డీఎల్‌డీఏ ఛైర్మన్ వెంకటప్పడు, భీమిలి మార్కెట్ కమిటీ ఛైర్మన్ రామునాయుడు, మాజీ ఎంపీపీ పద్మ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు, టీడీపీ నాయకులు రమణ, నగేశ్‌కుమార్, సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, సర్పంచ్ పాప, ఉత్సవ కమిటీ సభ్యులు నారాయణరావు, పద్మ, ఎర్నాయుడు, పైడిరాజు, రాము, రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవలో శాశ్వత పోలీస్ అవుట్ పోస్ట్

» ప్రభుత్వం ఉత్తర్వులు » ఉన్న సిబ్బందినే సర్దుబాటు చేసుకోవాలని పోలీస్ కమిషనర్‌కు ఆదేశం

విశాఖపట్నం, మే 9 (ఆంధ్రజ్యోతి): ఆరిలోవలో శాంతి భద్రతల పరిరక్షణకు శాశ్వత పోలీస్ అవుట్ పోస్ట్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై శుక్రవారం కీలక ఉత్తర్వులు జారీచేసింది. ఆరిలోవలో 1995లో పోలీస్ స్టేషన్ ఏర్పాటుచేశారు. ఆ తరువాత అవసరాలతో పాటు నేరాల సంఖ్య కూడా పెరగడంతో విమ్స్ ఆవరణలో రూ.5కోట్లతో కొత్త పోలీస్ స్టేషన్ నిర్మించారు. ఇది గత ఏడాది డిసెంబరు నుంచి అందుబాటులోకి వచ్చింది. పోలీసులు అంతా ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారు. అయితే పాత పోలీస్ స్టేషన్ ఆరిలోవ గ్రామంలో ఉండడం, ఆ చుట్టుపక్కలే పెద్ద సంఖ్యలో రౌడీ షీటర్లు, అల్లరి మూకలు ఉండడం వల్ల అక్కడ అవుట్ పోస్ట్ నిర్వహించాల్సి వస్తోంది. ఏదైనా ఘర్షణ, గొడవ జరిగితే స్థానిక ప్రజలు విమ్స్ వరకూ రావలసి వస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో శాంతి భద్రతలు అదుపులో ఉండాలంటే ఎక్కడికక్కడ విజిబుల్ పోలీసింగ్ అవసరమైన నేపథ్యంలో ఆరిలోవ పాత పోలీస్ స్టేషన్‌లోనే శాశ్వత అవుట్ పోస్ట్ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇలా చేస్తే స్థానికులకు పోలీసులు కూడా అందుబాటులో ఉంటారని భావించింది. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని విశాఖ సిటీ పోలీస్ కమిషనర్‌కు ఉత్తర్వులు పంపింది. ప్రభుత్వంపై ఆర్థిక భారం పడకుండా ఉన్న సిబ్బందినే సర్దుబాటు చేసుకోవాలని సూచించింది.

కేకే లైనులో రైల్వే జీఎం పర్యటన


క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్, డీఆర్ఎం లలిత్ బోహ్రా తదితరులు

విశాఖపట్నం, మే 9 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస, కొరాపుట్ లైనులో తూర్పుకోస్తారైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ శుక్రవారం పర్యటించి తనిఖీలు చేశారు. విండో ట్రైలింగ్ ద్వారా కొరాపుట్, అరకు, చిమిడిపల్లి స్టేషన్ల సెక్షన్‌లోని మలుపులు, బ్రిడ్జిలు, మేజర్ సొరంగాలు, భద్రతాపరమైన గోడలు, పాయింట్లు, క్రాసింగ్‌లు, ట్రాక్‌లను పరిశీలించారు. కొరాపుట్ స్టేషన్ వద్ద డబ్లింగ్ లైను నిర్మాణ పనులతోపాటు స్టేషన్‌లో ప్రయాణికుల మౌలిక వసతుల నిర్వహణ, పార్కింగ్, యార్డులోని భద్రతా చర్యలను తనిఖీ చేశారు. అనంతరం అమృతభారత్ పథకంలో భాగంగా అరకు స్టేషన్‌లో జరుగుతున్న స్టేషన్ అభివృద్ధి, ఇతర నిర్మాణ పనులను పరిశీలించారు. అరకు, చిమిడిపల్లి స్టేషన్ల మధ్య గల సొరంగాలు, వంతెనలు, రిటెన్షన్ గోడలను క్షుణ్ణంగా పరిశీలించి భద్రతా చర్యలపై ఆరా తీశారు. డీఆర్ఎం లలిత్ బోహ్రా, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహ నిరోధ చట్టంపై అవగాహన

సీతమ్మధార, మే 9 (ఆంధ్రజ్యోతి): నక్కవానిపాలెంలోని అంగన్వాడీ కేంద్రంలో కిశోర్ వికాసం వేసవి శిక్షణ, బాల్య వివాహ నిరోధ చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సెంటర్ సూపర్‌వైజర్ బి.కుమారి, సచివాలయం మహిళా పోలీస్ విజయలక్ష్మిలు మాట్లాడుతూ బాల్య వివాహాల కారణంగా బాలికలకు ఎదురయ్యే సమస్యలు, బాల్య వివాహ కార్యక్రమానికి హాజరయ్యే వారికి ఎదురయ్యే చట్టపరమైన ఇబ్బందులను వివరించారు.

నీటి ప్రాజెక్టులకు గండం

... 5వ పేజీ తరువాయి

పంపింది. జీవీఎంసీ నుంచి బకాయి వసూలు చేసుకోవాలని మరోమారు ప్రభుత్వం తేల్చిచెప్పింది. రైవాడ, మేహాద్రిగెడ్డ, గంభీరం, తాటిపూడి రిజర్వాయర్ల నిర్వహణ, గేట్ల దుస్థితిపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం జల వనరుల శాఖను అప్రమత్తం చేసింది. తక్షణమే జీవీఎంసీ నుంచి కొంత మేర బకాయిలు రాబట్టుకుని నిర్వహణ పనులు చేపట్టాలని సూచించింది. కాగా రైవాడ, మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ ప్రాజెక్టుల నిర్వహణ గురించి జల వనరుల శాఖ విశాఖ సర్కిల్ ఎస్ఈ కేవీఎన్ స్వర్ణకుమార్ వద్ద ప్రస్తావించగా జీవీఎంసీ నుంచి నిధులు వచ్చిన వెంటనే మరమ్మతులు చేస్తామన్నారు. బకాయిలు విడుదల చేయాలని పదేపదే కోరుతున్నామని పేర్కొన్నారు.

కిలేడీ

... 5వ పేజీ తరువాయి

ఆమెను ప్రత్యేకంగా కలవడానికి ప్రతి నెలా పని గట్టుకొని విజయవాడ వెళుతున్నట్టు ఆయా శాఖల సిబ్బంది గుసగుసలాడుతున్నారు. సాధారణంగా తహశీల్దార్లకు, సబ్ రిజిస్ట్రార్లకు ప్రతి నెలా విజయవాడ వెళ్లి ఉన్నతాధికారులను కలవాల్సిన అవసరం ఉండదు. కానీ వారు వెళుతున్నారంటే ఏదో ఉందని అనుమానిస్తున్నారు.

జీవీఎంసీ జోన్-2లో ఏమి జరిగిందో...?

మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లడానికి ముందు నకిలీ ఏసీబీ సీఐ బలగ సుధాకర్ జీవీఎంసీ జోనల్-2 కార్యాలయానికి వెళ్లాడు. అక్కడ వారు అనుకున్న విధంగా పని పూర్తయినట్టు తెలిసింది. అక్కడ ఎంత పుచ్చుకున్నారు?, ఎవరు ఇచ్చారు?...అనేది బయటకు రానివ్వడం లేదు. ఏసీబీ అధికారులు స్వర్ణలత కేసును మరింత పకడ్బందీగా విచారణ చేసి, అసలు ఇప్పటివరకూ ఎంతమందిని బెదిరించారు?, ఏ మేరకు వసూలు చేశారనే వివరాలు వెలికితీయాలి. అదేవిధంగా భవిష్యత్తులో ఇలాంటి వ్యవహారాలకు పాల్పడకుండా చూడాలి.

కార్డుదారులకు నాసిరకం పంచదార!

... 5వ పేజీ తరువాయి

నాణ్యత పరిశీలించి ప్రమాణాల కంటే తక్కువగా ఉంటే వెనక్కి పంపేసే అధికారం జిల్లా పౌర సరఫరాల సంస్థకు ఉంది. కానీ గోదాముల ఇన్‌చార్జులు, పౌర సరఫరాల సంస్థ అధికారులు ఏమి పట్టించుకోవం లేదని రేషన్ డీలర్లు ఆరోపిస్తున్నారు. నాసిరకం పంచదార పంపిణీ వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని వ్యాఖ్యానిస్తున్నారు.

బీఈడీ కాలేజీల ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

అనేక కాలేజీల్లో అర్హత కలిగిన సిబ్బంది ఉండడం లేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండా పోతోందంటున్నారు.

తరగతులకు హాజరుకాకపోయినా...

ఏటా బీఈడీ కోర్సుల్లో సుమారు ఐదు వేల మంది విద్యార్థులు చేరుతుంటారు. వారిలో దాదాపు రెండు వేల మంది తరగతులకు హాజరుకారంటే అతిశయోక్తి కాదు. బీఈడీ చేసేవారిలో ఎంతోమంది వేర్వేరు వ్యాపకాల్లో ఉంటారని, వారంతా ఆయా కాలేజీలకు ఫీజులు చెల్లించి పరీక్షలకు మాత్రమే హాజరవుతుంటారని చెబుతున్నారు. ఇటువంటి విద్యార్థుల నుంచి సదరు కాలేజీ యాజమాన్యాలు భారీగా ఫీజులు వసూలు చేస్తుంటాయన్నది జగమెరిగిన సత్యం. కాలేజీల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు, అకడమిక్ ఆడిట్‌లు నిర్వహించాల్సిన యూనివర్సిటీ అధికారులు చూసీచూడనట్టు వదిలేస్తుండడంతో ఇదో పెద్ద వ్యాపారంగా మారిందని చెబుతున్నారు.

మురళీ నాయక్ త్యాగాన్ని మరువలేం

» వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్

వెంకోజీపాలెం, మే 9 (ఆంధ్రజ్యోతి) : దేశ భద్రతలో తన ప్రాణాలను పణంగా పెట్టి వీరమరణం పొందిన తెలుగు జవాన్ మురళీనాయక్ త్యాగం మరవలేనిదని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశకోసం తన ప్రాణాలను పణంగా పెట్టి వీరమరణం చెందడం దేశానికే గర్వకారణమన్నారు. వీర మరణం పొందిన మురళీ నాయక్ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు ధైర్యాన్ని ఇవ్వాలని కోరారు.

శివాజీపాలెం-ఇసుకతోట డ్రైనేజీ నిర్మాణానికి రూ.80 లక్షలు మంజూరు

ఎంవీపీ కాలనీ, మే 9 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 17 వార్డు పరిధిలోని శివాజీపాలెం - ఇసుకతోట డ్రైనేజీ, కల్వర్టు నిర్మాణాలకు సుమారు రూ.80 లక్షలతో పనులు చేపట్టడానికి జీవీఎంసీ టెండర్లు పిలిచింది. కొద్ది రోజుల క్రితం భారీగా కురిసిన వర్షానికి ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న నివాసాలు, దుకాణాలు జలమయమయ్యాయి. సిమెంటు గొట్టాలతో ఉన్న డ్రైనేజీ చెత్తాచెదారంతో నిండిపోయి, ఇసుకతోట పెట్రోలు బంకు వద్ద మురుగునీరు బయటకు వచ్చేసింది. ఈ నేపథ్యంలో జాతీయ రహదారి నుంచి శివాజీపార్కు వరకూ డ్రెయిన్ నిర్మాణానికి రూ.38.86 లక్షలు, ఇసుకతోట శివాజీపాలెం వెళ్లే రోడ్డు నుంచి జాతీయ రహదారి పైనున్న పెట్రోలు బంకు వరకూ కల్వర్టు, డ్రయిన్ కోసం రూ. 41.65 లక్షల నిధులు మంజూరు కావడంతో పనులు చేపట్టనున్నారు.

జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 8 వినతులు



వినతులను స్వీకరిస్తున్న సిటీ ప్లానర్ మీనాకుమారి

వెంకోజీపాలెం, మే 9 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 8 వినతులు వచ్చినట్టు జీవీఎంసీ సిటీ ప్లానర్ వి. మీనాకుమారి తెలిపారు. శుక్రవారం ఆమె జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో సీపీలు, డీసీపీలు, ఏసీపీలతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జీవీఎంసీ పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుంచి అధికంగా ఫిర్యాదులు నమోదవుతున్నందున, ప్రతి శుక్రవారం జీవీఎంసీ పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుంచి ఫిర్యాదులు/ వినతులను స్వీకరించేందుకు ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

సినిమా గైడ్

● **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)

● **శుభం**: శారద, శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

● **హిట్** : జగదాంబ, సంగం, శ్రీరామ, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 14, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 22, పచ్చిమిర్చి 22, కాకరకాయలు 36, బీరకాయలు 36, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 15, క్యారెట్ 40 దొండకాయలు 24, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 54, అల్లం (పాతది)46, బరబాటి 34, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 48, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 84, కీరదోస 36, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30 చిలగడదుంపలు 38, కంద 80, దేముడు చిక్కుడు 44, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండ ఉసిరి 100, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	120
లైవ్ ధర	140
విత్ స్కిన్	250
స్కిన్‌లెస్	260

మౌలిక సదుపాయాలపై దృష్టి సారించండి

» జీవీఎంసీ అధికారులకు మేయర్ పీలా శ్రీనివాసరావు ఆదేశం » 10వ వార్డులో క్షేత్ర పర్యటన



ఇందిరానగర్‌లో కల్వర్టును పరిశీలిస్తున్న నగరమేయర్ పీలా శ్రీనివాసరావు

ఆరిలోవ, మే 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆయా ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జీవీ ఎంసీ అధికారులను మేయర్ పీలా శ్రీనివాసరావు ఆదేశించారు.. ఆయన శుక్రవారం ఉదయం 10వ వార్డులో గల ఇందిరా నగర్, రాజీవ్‌నగర్, బీఎస్ఆర్ నగర్ ప్రాంతాలను అధికారులతో కలిసి పర్యటించారు. తొలుత ఆదర్శనగర్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ ఐలాండ్ ప్రదేశం పెద్దదిగా ఉన్నం దున వాహనాల రాకపోకలకు ఇబ్బం ది కలిగి పలు ప్రమాదాలకు నెలవుగా మారిందని, కాబట్టి పోలీసు డిపార్టుమెంట్ సమన్వయం చేసుకొనిట్రాఫిక్ ఐలాండ్ వద్ద ప్రమాదాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ కె. కనక మహాలక్ష్మిని ఆదేశించారు. అలాగే పెట్రోల్‌బంక్ సర్వీస్ రోడ్డు పరిసర ప్రాంతంలో గల ఇందిరా నగర్ వెళ్లే ప్రవేశ ద్వారం వద్ద మరమ్మత్తులను చేపట్టి కాలువలు నిర్మించాలని ఆదేశించారు. అదే సర్వీసు రోడ్డులో నిలపిన పాత వాహనాలను వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఇందిరానగర్‌లో విద్యుత్ స్తంభాలు రోడ్డుకు అడ్డంగా ఉన్నం దున వాటిని స్థానాలను మార్చాలని సూచించారు. నివాసిత ప్రాంతాల నుంచి వచ్చిన వాడుక నీరు, కాలువ ప్రవాహానికి అడ్డంకులు ఉన్నందున వాటిని సరిచేయాలన్నారు.

రాజీవ్‌నగర్‌లో రోడ్లను పరిశీలించి.. అవి పాడైపోయినందుకు సిమెంటు రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకోసం ప్రతిపాదనలను రూపొందించాలని ఇంజనీరింగ్ అధికారులను సూచించారు. పారిశుధ్య పను లు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని శానిటరీ ఇన్స్పెక్టర్‌ను ఆదేశించారు. అనంతరం బీఎస్ఆర్ నగర్‌లో నిత్యావసర సరకులు పంపి ణీ చేసే వాహనాన్ని పరిశీలించారు. అందులో తూనిక రాళ్లను మేయర్ పరిశీలించారు. తాగునీటికి ఇబ్బంది గా ఉందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో.. సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదే శించారు. ఈ ప్రాంతంలతో వ్యక్తిగత కొళాయిల పైప్‌లైన్లు అస్తవ్యస్తంగా ఉన్నందున తాగునీటి ట్యాంకు ఏర్పాటు చేసి నీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని పర్యవేక్షణ ఇంజనీరు కేవీఎస్ రవిని ఆదేశించారు.ఈ ప్రాంతంలో దట్టంగా తుప్పలు పెరిగినందున దోమలు వృద్ధి చెందుతాయని, వెంటనే తుప్పలను తొలగించాలని ఆదేశించారు. గెడ్డల్లో పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. మౌలిక సపదుపాయాలపై ప్రత్యేక చర్య జరిపి వార్డులో పలు అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు.

ఈ పర్యటనలో ప్రధాన వైద్యాధికారి ఈఎన్వీ నరేష్‌కుమార్, పర్యవేక్షక ఇంజనీరు కృష్ణారావు, సహాయ వైద్యాధికారి డాక్టర్ ఎన్ కిషోర్, ఈఈ సుధీకర్, డీసీపీ హరిదాసు, ఏసీపీ తిరుపతిరావు, టీడీపీ 10వ వార్డు అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, కార్పొరేటర్ భర్త మద్దిల రాజశేఖర్, మద్దిల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుకతోటలో తాగునీటి సమస్య తీర్చండి

» ఏఈ వద్ద స్థానికుల ఆందోళన



ఏఈ రహీమ్‌కు సమస్య వివరిస్తున్న స్థానిక మహిళలు

వెంకోజీపాలెం, మే 9 (ఆంధ్రజ్యోతి) : నగర పరిధి 16వ వార్డులోని ఇసుకతోట రామాలయం వీధిలో నాలుగైదు ఏళ్లుగా తాగునీటి సమస్య ఉందని, కొళాయిలు సమయానికి రాకపోవడమే కాకుండా నీటి ధార కూడా సక్రమంగా రావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను టీడీపీ స్థానిక నాయకులు ముగడ వాసు, పల్లా ఉమా రాణి, నారు గోపిలు సంబంధిత నీటి సరఫరా విభాగం ఏఈ రహీమ్ దృష్టికి తీసుకువెళ్లారు. వీరితో పాటు సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్థానికులు కూడా ఈ సమస్యను మేయర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఏఈ ఈ ప్రాంతంలో పర్యటించి సమస్య గురించి అడిగి తెలుసుకున్నారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పరిష్కరించే చర్యలు చేపట్టలేదని ఏఈని స్థానిక మహిళలంతా నిలదీశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను సత్వరమే పరిష్కరిస్తానని ఏఈ హామీ ఇచ్చారు. నీటి సరఫరా జరిగేటప్పుడు వేసవి కాలం కావడంతో పైపు లెన్ ప్రెజర్ చివరి ఇళ్లకు తక్కువగా వస్తోందని, కొత్త పైపు లైన్ వేయడానికి అంచనా వేసి సిద్ధం చేస్తున్నామని తెలిపారు. త్వరలోనే కొత్త పైపులైన్ వేస్తామని, అప్పటి వరకు ప్రతి రోజూ ఈ ప్రాంతానికి మంచి నీటి ట్యాంకర్‌ను పంపిస్తామని ఏఈ తెలిపారు.

సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి



పైడిరాజును సత్కరిస్తున్న సీపీఐ నేతలు

వెంకోజీపాలెం, మే 9 (ఆంధ్రజ్యోతి) :సీపీఐ తూర్పు నియోజకవర్గం సమితి సమావేశం శుక్రవారం భానునగర్‌లో జరిగింది. సీపీఐ జిల్లా సమితి సభ్యులు పడాల గోవింద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపల్లి పైడిరాజు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు వారి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అర్హులైన పేద ప్రజలకు అర్బన్‌లో రెండు సెంట్లు ఇచ్చి ఇల్లు నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలను నియంత్రించాలని, విద్యుత్ సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని, రెండు దశాబ్దాల క్రితం సీపీఐ ఆధ్వర్యంలో పోరాడి సాధించుకున్న విశాఖ రైల్వే జోన్ విధి విధానాలను రూపొందించి వెంటనే రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు ఈ నెల 10, 11వ తేదీల్లో సీపీఐ జిల్లా మహాసభల్లో చర్చించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ఆర్థిక విధానాలు, ప్రజా సమస్యలపై ఏ విధంగా ముందుకు పోవాలో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించనున్నట్టు తెలిపారు. శనివారం సాయంత్రం కంచరపాలెం మెట్టు నుంచి పెద్ద ఎత్తున ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతుందని, ఇందులో పార్టీ తూర్పు నియోజకవర్గ నూతన సమితిని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పైడిరాజును సమితి సభ్యులందరూ దుశ్శాలువా కప్పి సత్కరించారు. ఈ సమావేశంలో సీహెచ్ కాసుబాబు, ఈగలవలస అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

వెంకట జగదీష్‌కు లెజెండరీ అవార్డు



వెంకటజగదీష్‌కు అవార్డు అందజేస్తున్న తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

విశాఖపట్నం,మే 9 (ఆంధ్రజ్యోతి): ఓటీఎస్ అడ్వర్టైజింగ్ ప్రైవేట్‌లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వెంకట జగదీష్ నల్లూరికి హైబిజ్ టీడీ మీడియా అవార్డ్స్ 2025 లో లెజెండరీ అవార్డు లభించింది. మీడియా, ప్రకటన రంగానికి ఆయన చేసిన అసాధారణ సేవలను గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేశారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో తెలంగాణ నీటి పారుదల శాఖా మంత్రి ఉత్తమకుమార్‌రెడ్డి ఈ అవార్డును అందజేశారు. సుమారు 40 ఏళ్లకు పైగా అనుభవంతో వెంకట జగదీష్ ప్రాంతీయ ప్రకటన రంగంలో కీలకపాత్ర పోషించారు. ఆయన సారథ్యంలో ఓటీఎస్ అడ్వర్టైజింగ్ ప్రముఖ సంస్థగా ఎదిగి మౌలిక సదుపాయాలు, పరిపాలన, విద్య, ఆరోగ్య రంగాల్లో సమగ్ర ప్రచారాలు చేసింది. ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయడం, ప్రభుత్వ సమాచారాన్ని సమర్థంగా ప్రజలకు చేర్చడంలో విజయవంతమయ్యారు.

చీటీల పేరుతో మోసగించిన దంపతుల అరెస్టు

మహారాణిపేట, మే9 (ఆంధ్రజ్యోతి) : చీటీల పేరుతో ప్రజల నుంచి రూ.కోట్లు కట్టించుకొని వాటిని తిరిగి ఇవ్వకుండా పరారైన కేసులో దంపతులను అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో వెదురుపాక వినయ్‌కుమార్, అతని భార్య పావని చీటీలు నిర్వహించారు. దిలీప్ జైన్ అనే వ్యక్తి వద్ద రూ.కోటి కట్టించుకొని తిరిగి ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నారు. ఈ క్రమంలో జైన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులకు ఆరిలోవ పరిధిలోని శ్రీకాంత్ నగర్‌లో శుక్రవారం వీరు పట్టుబడ్డారు. విచారించిన అనంతరం ఈ దంపతులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరు అనేక మందికి చీటీల డబ్బులు కోట్లాది రూపాయలు చెల్లించాల్సి ఉందని అనుమానిస్తున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్య

ఎంవీపీ కాలనీ, మే 9 (ఆంధ్రజ్యోతి): భార్యతో తలెత్తిన చిన్న తగాదా కారణంగా తీవ్ర మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎంవీపీ ఎస్ఐ కాదర్ బాషా తెలిపిన వివరాల మేరకు.. హెచ్‌బీ కాలనీలోని దుర్గానగర్‌లో కొంద్రు రమణ(45) భార్య, ఇద్దరు పిల్లలతో ఉంటున్నాడు. దంపతుల మధ్య తరచూ ఘర్షణలు జరుగుతుండేవి. ఈ క్రమంలో గురువారం రాత్రి కూడా బాగా గొడవ జరగడంతో మనస్తాపానికి గురైన రమణ ఇంటి స్లాబ్‌కు ఉన్న ఇనుప రాడ్డుకు చీరతో ఉరి వేసుకున్నాడు. గమనించిన కుమారుడు నానమ్మకు ఫోన్‌లో విషయం తెలియజేయడంతో, భీమిలి కంచేరుపాలెంలో ఉంటున్న కొంద్రు చిన్నమ్మ వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసింది. హెచ్‌సీ నూకరాజు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో మరొకరు..

మల్కాపురం (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో స్విగ్గీలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శ్రీహరిపురం శ్రీనివాసనగర్‌లో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... శ్రీనివాసనగర్‌కు చెందిన కిరణ్‌కుమార్ (39) స్విగ్గీలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల ఇతడి భార్య బంధువుల ఇంట్లో పెళ్లి కోసం ఒడిశాలోని బరంపురం వెళ్లింది. ఆర్థిక ఇబ్బందులతో సతమవుతున్న కిరణ్ ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకున్నాడు. దుర్వాసనవస్తుండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు చూసేరికి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కుతరలించారు.హెచ్‌సీ పీవీ స్వామి కేసుదర్యాప్తు చేస్తున్నారు.

తైక్వాండో వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం



తైక్వాండో శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సునీత

ఆరిలోవ, మే 9 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు దేహ దారుఢ్యాన్ని పెంపొందించడంతో పాటు మానసిక వికాసాన్ని కలుగజేస్తాయని 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ పేర్కొన్నారు.జీవీఎంసీ 13వ వార్డులోని ఆరిలోవ కాలనీ ఆఖరి బస్టాప్ సమీపంలో గల నూకాలమ్మ అమ్మవారి గుడి పక్కన గల మైదానం లో నిర్వహిస్తున్న తైక్వాండో వేసవి శిక్షణ తరగతులను శనివార ఉదయం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా సహ-పాఠ్యాంశాలపై కూడా దృష్టి సారించాలని సూచించారు. అప్పడే వారు సంపూర్ణ విజ్ఞానవంతులు అయ్యేందుకు అవకాశం లభిస్తుందన్నారు. ఈ శిక్షణ శిబిరం ఈ నెల 31వరకు ఉంటుందని, ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కోచ్ ఆలీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు, టీడీపీ నేతలు రాజు, అప్పారావు, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో వాటర్ స్పోర్ట్స్‌కు పూర్వ వైభవం

» శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు



కయాకింగ్ క్రీడాకార్లతో బోటురేసింగ్‌లో పాల్గొన్న శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు

సాగర్‌నగర్, వే ు9 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రుషికొండ ప్రాంతంలో నిర్వీర్యమైన వాటర్ స్పోర్ట్స్‌కు పూర్వ వైభవం తీసుకువస్తామని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. రుషికొండలో డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో కెనాయింగ్ అండ్ కయాకింగ్ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన వాటర్‌స్పోర్ట్స్ సమ్మర్ కోచింగ్ క్యాంపును శుక్రవారం ఆయన ప్రారంభించారు. వాటర్ స్పోర్ట్స్ నిర్వహిస్తున్న డీఎస్ఏ ల్యాండ్ పరిశీలించిన అనంతరం క్రీడాకారులతో కలసి బోటిరేసింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ వేదికగా వాటర్ స్పోర్ట్స్ అభివృద్ధి చేయాలని 2002లోనే అప్పటి సీఎం చంద్రబాబునాయుడు భావించి ఆచరణలో పెట్టడంతో పాటు 2019 వరకు సమర్థగా నిర్వహించామన్నారు. వైసీపీ హయాంతో వాటర్ స్పోర్ట్స్ నిర్వీర్యమైందన్నారు. డీఎస్ఏ పరిధిలోని దీని నిర్వహణకు కేటాయించిన స్థలాన్ని సైతం జగన్ కబ్జా చేశారన్నారు.ఈ సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లగా డీఎస్ఏ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారన్నారు. ఇది క్రీడ మాత్రమే కాదని ఆపత్కాలంలో ప్రాణాలను కాపాడే బాధ్యతయుతమైన వరమన్నారు. కార్యక్రమంలో డీఎస్డీఓ జూన్, బలరామ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో యువత నిస్తేజం

» గత పాలకుల తప్పులతోనే బెట్టింగ్ జోలికి

» హోం మంత్రి వంగలపూడి అనిత

» పెందుర్తిలో జాబ్ మేళాకు అనూహ్య స్పందన



జాబ్ మేళాలో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

పెందుర్తి, మే 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ఉపాధి కల్పన లేక నిరుద్యోగ యువత బెట్టింగ్ జోలికి వెళ్లిందని హోం మంత్రి వంగలపూడి అనిత విమర్శించారు. అర్హులందరికీ ఉపాధి కల్పన లక్ష్యంగా పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఆధ్వర్యంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సౌజన్యంతో శుక్రవారం పెందుర్తి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాను మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి అందించే ధ్యేయంతో ప్రతి మూడు నెలలకూ రాష్ట్రంలోని అన్ని నియోజకవరాల్లో జాబ్‌మేళాలు నిర్వహిస్తోందన్నారు. కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో యువత ఉద్యోగావకాశాలు అందిపుచ్చుకోవాలంటే సృజనాత్మకత, నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. నగర మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ సీ ఎం చంద్రబాబు చొరవతో అనేక కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్రానికి తరలివస్తున్నాయని దీంతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. కార్య క్రమానికి అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ సృజన, నైపుణ్యతకు వేదిక కల్పిస్తే యువత మరో ప్రపంచాన్ని సృష్టిస్తారన్నారు. టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ మాట్లాడుతూ విలువలు తెలుసుకుని ఉపాధి బాట బట్టాలన్నారు. అనంతరం పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను మేళాలో పాల్గొన్న కంపెనీల హెచ్ఆర్‌లను మంత్రి సత్కరించారు. అంతకు ముందు సిందూర్ ఆపరేషన్‌లో అమరులైన జవాన్లకు నేతలు నివాళులర్పించారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు చాముండేశ్వరరావు, గోవింద్, ఉపాధి అధికారి సుబ్బిరెడ్డి, జెడ్పీ హైమావతి, కార్పొరేటర్లు సేనాపతి వసంత శంకరరావు, మొల్లి ముత్యాలు, నేతలు సింహాచలం, దివాకర్, పరమేశ్వరరావు, అప్పారావు, అజయ్, దేవుడు, శ్రీను పాల్గొన్నారు.

826 మందికి ఉద్యోగాలు

మేళాలో 45 కంపెనీలు పాల్గొన్నాయి. మూడు వేల మంది యువత హాజరు కాగా టెక్ మహీంద్ర, యుకోమా, హెట్రో, టాటా ట్రెంట్, తదితర కంపెనీలతో పాటు మరో 45 సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 826 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. మరో 238 మందిని పరిశీలనలో ఉంచారు. ఎంపికైన వారికి ఎమ్మెల్యే రమేశ్‌బాబు నియమాక పత్రాలు అందించారు.

నగర పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం

» మేయర్ పీలా శ్రీనివాసరావు



బీచ్‌ను శుభ్రం చేస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

వెంకోజీపాలెం, మే 9 (ఆంధ్రజ్యోతి): నగర పరిశుభ్రతకు, సుందరీకరణకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శుక్రవారం ఆర్కేబీచ్‌లో బీచ్ క్లీనింగ్ యంత్రాన్ని నడిపి, పనితీరును పరిశీలించారు. సుందరమైన నగరాన్ని మరింత పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషిచేస్తున్నారని, తీరంలో ఆహ్లాదక వాతావరణం కల్పించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. బీచ్‌లో వ్యర్థాలు వేయకుండా సందర్శకులకు, ఇక్కడి దుకాణదారులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేశ్‌కుమార్‌ను ఆదేశించారు. మేయర్ వెట జీవీఎంసీ ప్రజారోగ్యం అధికారులు, పారిశుధ్య కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ డిప్యూటీ సీఎంఈకు అభినందనలు



సీఎంఈగా పదోన్నతి పొందిన కె.రాజశేఖర్‌ను అభినందిస్తున్న ఆర్టీసీ జైభీమ్ అసోసియేషన్ నాయకులు

ద్వారకా బస్‌స్టేషన్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సింహాచలం డిపో మేనేజర్‌గా పని చేసి పదోన్నతిపై ఆర్టీసీ విశాఖ రీజియన్ డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్‌గా బాధ్యతలు చేపట్టిన కె.రాజశేఖర్‌ను ఆర్టీసీ జైభీమ్ అసోసియేషన్ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ద్వారకా కాంపెక్సులోని ఆయన కార్యాలయంలో రాజశేఖర్‌ను దుశ్శాలువ కప్పి సత్కరించారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి యల్లపు రాంబాబు, అధ్యక్షుడు ఇ.కోటేశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.గురయ్య, సంయుక్త కార్యదర్శి గొల్ల సోములు, కోశాధికారి బోర కోటేశ్వరరావు, సింహాచలం డిపో శాఖ కార్యదర్శి కె.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.